www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 46   సంచిక : 15   విజయవాడ   5-12-2013   పేజీలు : 8   వెల : రు 5.00

లోపలి పేజీల్లో...

- మహిళలపై అత్యాచారాలు-దోషులకు శిక్ష-వెల్లడైన ఛాందసవాదులు -డా॥అస్ఘర్‌అలీ ఇంజనీర్
- మూలనపడిన బాలికా సంరక్షణ పథకం
- సంక్షోభంలో ప్రతిసేద్యం చేనేత వృత్తిని రక్షించుకుందాం! జీవనోపాధిని నిలబెట్టుకుందాం! - ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం(AIFTU న్యూ)అనుబంధ కరపత్రం

## వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేస్తున్న దళారీ పాలకులు

**సామ్రాజ్యవాదపు** చేతిలో పనిముట్టు అయినందున, ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరినందువల్ల ఒనగూడే లాభాల కంటే అభివృద్ధి చెందుతున్న దేశాలకు జరిగే హానే ఎక్కువన్న విమర్శ ఈ రోజున వాస్తవ రూపంలో మన ముందుకు వస్తున్నది. బాలీలో జరగబోతున్న ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రుల స్థాయి సమావేశమూ, దానికి సన్నాహంగా సాగుతున్న చర్చలూ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు తమ దేశాల ప్రయోజనాలను సామ్రాజ్యవాదానికి బలిపెట్టడం తప్ప మరో ప్రత్యామ్నాయంలేని స్థితిని కల్పించాయని తెలుపుతున్నాయి.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికా దేశాలు పేదరికసమస్యనూ, తత్పర్యవసానంగా ఆకలి సమస్యనూ ఎదుర్కొంటున్నాయి. ప్రపంచస్థాయిలో చూసినప్పుడు ప్రపంచ ప్రజల అవసరాలు తీర్చగల ఆహారోత్పత్తి సాగుతున్నా ప్రపంచ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నది. ఉరుగ్వే చర్చల తర్వాత ప్రపంచ ఆహార ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రపంచ ఆహార సంస్థ ధరల సూచిక ప్రకారం 2002 నుండి 2012 మధ్య ధరల సూచిక 89.9 నుండి 211.8కి అంటే రెట్టింపుకు పైగా పెరిగింది. ఈ స్థితిలో పేదదేశాలు తమ ఆహారోత్పత్తిని పెంచుకుంటే తప్ప ఆకలి సమస్యను తీర్చుకోలేవు. కనుక ఆహారోత్పత్తి పెంపుదల కోసం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు తమ దేశాలలో రైతాంగానికి పలు రకాలుగా మద్దతివ్వవలసిన అవసరం వుంది. సన్నకారు రైతాంగం ఎక్కువగాఉండటం, భూమి ఉత్పాదకత సామర్థ్యానికి వున్న పరిమితి వంటి వ్యవసాయ రంగానికున్న అనివార్య కారణాల రీత్యా మద్దతునందించటం తప్పనిసరి అవుతుంది.

రైతాంగానికందించే ఈ మద్ధతు పలురూపాల్లో ఉంటుంది. వ్యవసాయ ఉత్పాదకాల (ఎరువులు, విత్తనాలు, నీటిపారుదల) ధరలపై సబ్సిడీలు, కనీస మద్దతు ధర, ధాన్యసేకరణ... కొన్ని రూపాలు కాగా, రైతులకు నేరుగా నగదు బదిలి చేయటం, బీమా చెల్లింపు ఏర్పాటు, రైతులకు తగ్గిన ఆదాయాన్ని చెల్లించటం వంటివి మరికొన్ని రూపాలు.

ఈ రెండవరకపు మద్దతు చర్యలు అమలుకావటానికి, రైతులకు సంస్థాగత రుణసౌకర్యం పూర్తిగా అందగల విధంగా బ్యాంకు కార్యకలాపాల విస్తరణ, మార్కెట్టు వ్యవస్థ పూర్తిస్థాయిలో ఏర్పడటం, సంఘటితపడ్డ భూకమతాల ఏర్పాటు వుండాలి. మరోమాటలో చెప్పాలంటే వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు పూర్తిస్థాయిలో ఏర్పడి వుండాలి. అలా ఏర్పడివున్న సామ్రాజ్యవాద దేశాలూ ఈ రూపంలోనే రైతులకు తమ మద్దతును అందిస్తున్నాయి. ఈ మద్దతు ఈనాటికీ విపరీతస్థాయిలో వుంటున్నది. అమెరికా సామ్రాజ్యవాదులు తమ దేశంలో ప్రత్తిపంట విలువకంటే 150 శాతం ఎక్కువ సొమ్ము సబ్సిడీగా ఇచ్చారు. 2010లో అమెరికా యిచ్చిన ఆహారసబ్సిడీ మొత్తం 9400 కోట్ల డాలర్లు (దాదాపు 5లక్షల 60వేల కోట్ల రూ॥లు) ఇది 2012లో 10వేల కోట్ల డాలర్లకు పెరిగింది.

కాగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలోని వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధి నిరంతర సంక్షోభంలో వుంటున్నది. అందువల్ల వ్యవసాయ ఉత్పత్తి సమాచారం అసమగ్రంగా వుండటం, భూమికి పట్టాలు కూడా అస్తవ్యస్తంగా వుండటం, అనియత మార్కెట్టు ప్రబలంగా వుండటం, సంస్థాగత ద్రవ్యసంస్థల వ్యవసాయరంగ కార్యకలాపాల వెనుకబాటుతనం, గుత్తవ్యాపారులు మార్కెట్టులో ధరలను నియంత్రించటం వంటి కారణాలతో ఈ దేశాలలో రైతాంగానికి రెండవరకపు మద్ధతునందించటం సాధ్యంకాదు. అందువల్ల అవి, కనీస మద్దతుధర, ధాన్యసేకరణ, ఉత్పాదకాలను సబ్సిడీ రేట్లకందించడం... రూపంలో రైతాంగానికి మద్దతునందించాలి; అందించేవి.

1994లో 'గాట్' ఒప్పందం జరిగేనాటికి సామ్రాజ్యవాద దేశాలు తామందిస్తున్న సబ్సిడీలన్నింటినీ డీకపుల్డు సబ్సిడీలుగా పేర్కొన్నాయి. అంటే వ్యవసాయరంగంతో సంబంధం తెంచివేసిన సబ్సిడీలుగా పేర్కొన్నాయి. ఉదాహరణకు పంటను అమ్ముకున్నందున రైతుకు వచ్చిన ఆదాయం తక్కువగా వుంది. గనుక తగ్గిన ఆదాయాన్ని యిస్తున్నాము తప్ప, వ్యవసాయానికి యిచ్చినట్లుకాదు అన్నది సారాంశం. కాగా ఉత్పాదకాలకు సూటిగా రైతుకిస్తున్న సబ్సిడీ కనుక అది వ్యవసాయ సబ్సిడీ అవుతుంది. ఆ తర్వాత జరిగిన వ్యవసాయ ఒప్పందంలో తామిస్తున్న సబ్సిడీలన్నింటినీ గ్రీన్ బాక్సులో చేర్చారు. ఈ గ్రీన్ బాక్సు సబ్సిడీలపై ఎలాంటి ఆంక్షలూ వుండవు. కాగా పేద దేశాలిస్తున్న సబ్సిడీలను ఊదా బాక్సులోకి చేర్చారు. ఈ సబ్సిడీలు ఒక పరిమితిని మించి (పంట విలువలో 10శాతాన్ని మించి) యివ్వరాదని నిబంధన పెట్టారు. ఫలితంగా పేదదేశాలు తమ రైతాంగానికిస్తున్న సబ్సిడీలను తగ్గించివేయాల్సి వస్తుంది. దీనివల్లనే భారత ప్రభుత్వం వ్యవసాయ రంగానికిస్తున్న సబ్సిడీలు మోయలేని భారమన్న తప్పుడు వాదనతో ఎరువుల రేట్లు, నీటి ఛార్జీలూ, డీజిలు విద్యుత్తు రేట్లు పెంచివేస్తున్నాయి. కనీస మద్దతు ధరలను తగినవిధంగా పెంచకుండా వుండటంతో పాటు ధాన్య సేకరణను కూడా తగ్గించివేస్తున్నాయి.

గ్రీన్ బాక్సు సబ్సిడీలుగా తమ సబ్సిడీలను మార్చుకునే స్వేచ్ఛ పేదదేశాలకుంది గనుక ఒప్పందంలో ఇది సమానత్వమే కదా అన్న వాదనతో మోసాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు. గ్రీన్ బాక్సు సబ్సిడీలను వినియోగించుకోగల స్థితిలేని దేశాలకు ఈ సమానత్వం పనికిరాని కాగితమే. ఒక్క చైనా తప్ప గ్రీన్‌బాక్సు సబ్సిడీలను చెప్పుకోతగ్గ స్థాయిలో వినియోగించుకుంటున్న అభివృద్ధి చెందుతున్న దేశంలేదు. ఎంతో కొంత వినియోగించుకుంటున్న దేశాలలో కూడా గత పదేళ్ళలో గ్రీన్‌బాక్సు సబ్సిడీలు తగ్గిపోతున్నాయి.

ఈ 10శాతం అన్న నిబంధన ఎంత హానికరమో భారత్‌ను ఉదాహరణగా తీసుకుని చూద్దాం. డబ్ల్యుటివో ఒప్పందం జరిగిన నాటికి, 30దేశాల ఊదా బాక్సు సబ్సిడీలు పరిమితిని దాటిపోయాయి. వాటిలో భారతదేశం లేదు. ప్రభుత్వం యిస్తున్న కనీసమద్దతు ధరలో ఎంత సబ్సిడీ వుందో ఎలా నిర్ణయిస్తారు? యురుగ్వే ఒప్పందంలో పంటలకు ఎక్స్‌టర్నల్ రిఫరెన్సు ధరను నిర్ణయించారు. అంటే దేశం వెలుపల పంట సగటుధర. ఈ ఇ.ఆర్.పికి ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్ధతుధరకూ మధ్య తేడాను సబ్సిడీగా పరిగణిస్తారు. ఇది పంట విలువలో 10శాతానికి మించకూడదు. బియ్యానికి యురుగ్వే ఒప్పందంలో కేజికి 3రూ॥ 52 పైసలను ఇ.ఆర్.పిగా 1986 - 88 ధరల ప్రకారం నిర్ణయించారు. ఇప్పుడు భారత ప్రభుత్వం బియ్యానికిస్తున్న కనీస మద్దతుధర 19రూ॥ల 65పై (ఇది వరిధాన్యానికిచ్చిన కనీస మద్ధతుధరతో సేకరించిన ధాన్యం నుండి ఫుడ్ కార్పొరేషను అమ్ముతున్న బియ్యం ధర). దీని ప్రకారం బియ్యానికస్తున్న సబ్సిడీ ఇప్పుడు 16రూ॥ల 13పైసలయింది. అంటే దాదాపు 300 శాతమయింది. దీనిని పదిశాతానికి తగ్గించాలంటే, గత ఏడాది ప్రభుత్వం సేకరించిన 3కోట్ల 40లక్షల టన్నులను ఈ ఏడాది కోటి టన్నులకు తగ్గించాలి. అలా తగ్గించమనే డబ్ల్యుటివో ఒప్పందం ద్వారా సామ్రాజ్యవాద దేశాలు వత్తిడి చేస్తున్నది. అలా తగ్గించటానికి ఒప్పందంలోని పీసు క్లాజు ప్రకారం రెండేళ్ళు గడువిస్తున్నాయి. దీనిని అమలు జరపటమంటే భారత ప్రభుత్వం ధాన్యసేకరణ నుండి దాదాపు తప్పుకోవటమే. ప్రైవేటు గుత్తవ్యాపారుల ముందు రైతాంగాన్ని నిస్సహాయులుగా నిలబెట్టడమే.

**(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

## ఎండమావిగా దళితులకు న్యాయం

**భారత** సామాజిక వ్యవస్థలో దళితులకు న్యాయం ఒక ఎండమావి అనటం అతిశయోక్తి ఏమాత్రం కాదు. గత 66ఏళ్ళుగా దేశంలోని దళితుల చేదు అనుభవం చెబుతున్నదిదే. దళితులపై దాడి, ఊచకోతల రెండు కేసులలో 2013 అక్టోబరులో వెలువడిన తీర్పులు దీనినే మరోసారి రుజువు చేశాయి.

బీహార్‌లోని లక్ష్మణ్‌పూర్‌బాతే గ్రామంలో దళితులపై మారణాయుధాలతో దాడిచేసి 27మంది మహిళలు, 14 మంది పిల్లలతోసహా 58 మందిని హతమార్చిన భూమిహార్ (భూస్వాముల) ప్రైవేటు సైన్యమైన రణబీర్‌సేన సభ్యులకు జిల్లా కోర్టు విధించిన శిక్షలను హైకోర్టు రద్దుచేసింది. జిల్లా జడ్జి 16 మందికి మరణశిక్ష, 10మందికి జీవితఖైదు విధించగా పాట్నా హైకోర్టు వీరందరినీ నిర్దోషులుగా తీర్పునిచ్చింది. 16ఏళ్ళ తర్వాత ఈ తీర్పు వచ్చింది. ఈ 26మందినీ నిర్దోషులుగా తీర్పు యివ్వటానికి హైకోర్టు చెప్పిన కారణం "ప్రాసిక్యూషన్ తరఫు సాక్షులు ఆధారపడదగినవారు కాదు" అని!

ఈ సాక్షులెవరు? ఈ ఊచకోతను కళ్ళారా చూసిన, దాడి నుండి తప్పించుకున్న ఆ గ్రామదళితులు. ఈ 26మంది హత్యాకాండ సాగించకపోయివుంటే, మరి ఆనాటి ఊచకోతను సాగించిన వారెవరు? ఈ ప్రశ్నను హైకోర్టు పట్టించుకోలేదు. అలా పట్టించుకుంటే అసలు నేరస్తులెవరో తేల్చేందుకు మళ్ళీ పరిశోధనకు ఆదేశించాల్సి వచ్చేది. శుద్ధ న్యాయ చట్ట వైఖరినే హైకోర్టు తీసుకుంది. ఇలాంటి వైఖరే సాగితే "ఆ దళితుల కన్నీరు తుడిచేదెవరు?"

ఇదే సంవత్సరం - అక్టోబరు 29న 54మంది ముద్దాయిలను నిర్దోషులుగా పేర్కొంటూ ఒరిస్సాలోని జిల్లాకోర్టు విడిచిపెట్టింది. 2007లో కంధమల్ జిల్లా, బక్మా గ్రామంలో హిందూ మతోన్మాదశక్తులు ఒక బాప్టిస్టు చర్చినీ, 14మంది క్రిస్టియన్ల ఇళ్ళను తగులబెట్టాయి. తగిన సాక్ష్యం లేదన్న కారణంతో కోర్టు ముద్దాయిలను విడిచిపెట్టింది.

ఇవి అరుదైన కేసులేమీ కావు. హిందూ అగ్రవర్ణ భూస్వామ్య దాడుల కేసులను 1960లలో తమిళనాడులోని కీలవేన్మణి దాడి నుండి నేటి వరకూ పరిశీలిస్తే, నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టడమే న్యాయవ్యవస్థ చేస్తూ వచ్చింది.

ఈ 'గౌరవనీయ' కోర్టుల ముందు అగ్రవర్ణ భూస్వాములు దళితులపై దాడిచేసి హత్యాకాండ సాగించారన్న వాస్తవం రికార్డు అయినప్పటికీ, ఇంత హీననేరాల పట్ల లీగలిస్టు వైఖరిని తీసుకుని, చట్ట చిక్కుముడులతో దోషులను విడిచిపెడుతున్నాయి. నిందితులను గురించి చెప్పే సాక్ష్యాలు సరిగ్గాలేవని అనుకున్నా, అసలు నేరస్తులెవరో తేల్చి, వారికి శిక్షవిధించే ప్రయత్నాలంటూ న్యాయస్థానాలు చేయటంలేదు. మళ్ళీ పరిశోధించి, నేరస్తులను పట్టుకొమ్మని ఆదేశించే విశేషాధికారాలు కోర్టులకున్నప్పటికీ అవి అందుకు పూనుకోవటంలేదు.

న్యాయస్థానాలు తీసుకుంటున్న ఈ లీగలిస్టు లాంఛన వైఖరి కూడా అరుదైనదిగా భావించలేము. ఒకరిద్దరు న్యాయమూర్తుల వైఖరిగా కూడా చూడలేము. బ్రిటీషు వలస పాలకుల నుండి వారసత్వంగా పొందిన న్యాయవ్యవస్థ ప్రక్రియల్లో అవిభాజ్య భాగంగానే ఇది ఉంది. ఇంతేకాక దళితుల అణచివేతను సమర్ధించే హిందుత్వ భావజాల ప్రభావానికి న్యాయవ్యవస్థ లోనవుతున్నది. భూస్వామ్య వర్గాలు దళితులపై సాగిస్తున్న అత్యాచారాలూ, హింసాకాండలను పట్టించుకోవాల్సినవిగా అది పరిగణించటంలేదు.

ఒరిస్సాలో క్రిస్టియన్ ఫాదర్ స్టెయిన్స్‌ను సజీవదహనం చేసిన హిందూత్వ సంస్థ పట్ల ఇలాంటి ఉదాశీన వైఖరినే న్యాయస్థానాలు చూపాయి.

1985లో చుండూరులో సాగిన దళితుల ఊచకోత పట్ల కూడా ఇలాంటి పట్టించుకోని వైఖరినే అవి చూపాయి. 1991లో కారంచేడులో దళితులపై హింసాకాండ సాగించిన దోషులను విడిచిపెట్టడంలోనూ ఇదే ఉదాసీనత వ్యక్తమైంది. 2012, 2013లలో బీహార్‌లోని బతానీతొలా, నగ్రీబజార్ ఊచకోతలలో దోషులను విడిచిపెట్టడంలోనూ ఇదే వైఖరి!

లక్షింపేటలో దళితులపై సాగిన దాడిలో నిందితులైన పెత్తందారీ వర్గాలను విచారించి, శిక్షించేందుకు ప్రత్యేక కోర్టును కోరుతూ దళితసంఘాలూ, హక్కుల సంఘాలు పోరాడవలసి వచ్చింది.

దళితులపై హత్యాచారాలు సాగించిన దోషులను విడిచిపెట్టిన సందర్భాలను పేర్కొంటూపోతే లెక్కలేనన్ని వున్నాయి. "పవిత్ర" "ఉదార" హిందూ దేశంలో గత 66 ఏళ్ళుగా సాగుతున్నదిదే!

చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలూ, ప్రాసిక్యూషన్ అధికారులూ దోషులతో కుమ్మక్కు అయి కేసులను బలహీనపరచి కోర్టు ముందుకు తెస్తున్నారన్నది నిర్వివాద అంశం. అయినా హక్కుల సంఘాలు ఎంత పకడ్బందీగా ప్రాసిక్యూషన్ సాగేట్లు చూసినా - కారంచేడు కేసులో లాగా - ఏదో ఒక సాంకేతిక కారణంతో దోషులను విడిచిపెట్టడం పరిపాటి అయింది.

ఇలా విడిచిపెట్టిన కేసులన్నింటిలోనూ సందేహలబ్ధిని (బెనిఫిట్ ఆఫ్ డౌట్) దోషుల కనుగుణంగా వినియోగించారు తప్ప, దళిత బాధితులకు అనుకూలంగా వినియోగించలేదు. నేటి న్యాయవ్యవస్థ అవగాహనే దళితులకు ప్రతికూలంగా వుందని ఇదే తెలుపుతున్నది.

అంబేద్కరు పట్టుబట్టి దళితులు, బలహీనులు, పేదవర్గాలకు రక్షణలను చేర్పించిన రాజ్యాంగ చట్టం కూడా భూస్వాముల దాడుల నుండి వారికి రక్షణలు అందించలేకపోయిందన్న చేదు వాస్తవాన్నే ఈ దోషుల విడుదలలు తెలుపుతున్నాయి.

**(తరువాయి 2వ పేజీలో)**

## వ్యవసాయరంగాన్ని...(మొదటిపేజీ తరువాయి)

భారత్, చైనా, బ్రెజిల్‌తోసహా 43దేశాలు పెరిగిన ధరల ప్రకారం ఇఆర్‌పిని పెంచటమో లేదా ప్రపంచ బ్యాంకు రూపొందించిన ద్రవ్యోల్బణ సూచిక ప్రకారం కనీసమద్దతు ధరను నిజస్థాయికి తగ్గించటమో చేయాలనీ, అప్పుడు సబ్సిడీని ఎంతో కొంత వాస్తవ స్థాయికి నిర్ణయించగలుగుతామని కోరాయి. అయితే సామ్రాజ్యవాదులు దీనికి అంగీకరించలేదు. పీసు క్లాజు ప్రకారం 10శాతం సబ్సిడీ అమలుకు రెండేళ్ళు సమయమిస్తామని చెప్పాయి.

అదే సమయంలో అమెరికా ప్రత్తిపంటకు ఇస్తున్న సబ్సిడీవల్ల ఆఫ్రికాలోని కోట్లాదిరైతులు నష్టపోతున్నారనీ, ఇది డబ్ల్యుటివో ఒప్పందం ప్రకారం ధరలను వక్రీకరించటమేననీ డబ్ల్యుటిఓ ముందు చర్చకు వచ్చింది. 2005లో దోహాలో జరిగిన డబ్ల్యుటివో మంత్రుల స్థాయి సమావేశం ఈ సమస్యను పరిష్కరించి 'ధరల వక్రీకరణ' ఆపే చర్యలను నిర్దిష్టంగా తీసుకొమ్మని అమెరికా, యూరోపియన్ యూనియన్‌లకు చెప్పింది. అమెరికా దీనికి సుముఖంగా లేదు గనుక 8ఏళ్ళు గడిచిపోయినా ఏ నిర్ణయం చేయకుండా మిగిలి పోయింది. సభ్యదేశాల మధ్య సమానత్వం పేరిట సామ్రాజ్యవాదుల ద్వంద ప్రమాణాల వంచనను ఇది తెలుపుతుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలు అడుగుతున్న మార్పులను నిరాకరించడానికి అలా మార్పులు చేస్తే యురుగ్వే ఒప్పందానికి తూట్లుపొడిచినట్లు అవుతుందని అమెరికా వాదిస్తున్నది. దాని దృష్టిలో ఉరుగ్వే ఒప్పందం ఒక అనుల్లంఘనీయ పవిత్ర డాక్యుమెంటు. ఇంతకీ ఈ ఒప్పందం చేసుకున్నదెవరు? అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు ఈ ఒప్పందం చేసుకొన్నాయి. వ్యవసాయరంగానికి తామిస్తున్న సబ్సిడీలను తొలగించకుండా గ్రీన్‌బాక్సులో చేర్చుకున్నాయి. ఈ ఒప్పందానికి కొన్ని అతుకులు వేసి ప్రపంచ వాణిజ్య సంస్థ వ్యవసాయ ఒప్పందంగా రుద్దాయి. వ్యవసాయరంగానికి విపరీత సబ్సిడీలిస్తున్న సామ్రాజ్యవాద దేశాలన్నీ – యూరోపియన్ యూనియను, కెనడా, నార్వే, జపాను, స్విట్జర్లాండు, ఆస్ట్రేలియా, న్యూజిలాండు – అమెరికాకు వత్తాసుగా నిలిచాయి. 43దేశాలు కలిసి అడిగినా, అనుకూల నిర్ణయంకోసం మరో 100 దేశాలు ఎదురుచూస్తున్నా తమ ఇచ్ఛ ప్రకారమే సాగించేందుకు పూనుకున్నాయి.

పేద దేశాల వ్యవసాయరంగాన్ని దెబ్బతీసి, వారి ఆహార అవసరాలకు తమపై ఆధారపడేట్లు చేసుకొని, తమ దోపిడీ ప్రయోజనాలకనుగుణంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల వ్యవసాయరంగాన్ని పునర్నిర్మించే ఆర్థిక ఆధిపత్య సాధన లక్ష్యంతోనే సామ్రాజ్యవాద దేశాలు ఇలా వ్యవహరిస్తున్నాయి.

ఇక్కడే బాలీ సమావేశంలో చర్చకు రాబోయే మరొక అంశాన్ని పేర్కొనాలి. అది ట్రేడ్ ఫెసిలిటేషన్ (వాణిజ్య ప్రోత్సాహ) ఒప్పందం. బాలీ సమావేశానికి సాగుతున్న సన్నాహాలలో భాగంగా చర్చలన్నిటా దీనిని ముందుకు తెస్తున్నారు. ఈ ఒప్పందం వల్ల వివిధ దేశాల మధ్య వాణిజ్యం సరళతరమౌతుందనీ పేదదేశాలు అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతులు పెంచుకుని లబ్ధిపొందుతాయని చెబుతున్నారు. సామ్రాజ్యవాద దేశాల ఎగుమతి – దిగుమతి విధానంలోని నియమ నిబంధనలను, సుంకాలను సరళతరం చేస్తే, ప్రత్యేకించి నాన్ ప్రెపరెన్షియల్ రూల్సు ఆఫ్ ఆరిజిన్ (ఏ దేశం నుండి సరుకులు దిగుమతి అవుతున్నాయన్నదాన్ని బట్టి వర్తించే సుంకాలు అనుమతులు) సరళతరం చేయాలన్న అంశంపై చర్చలు 1998లోనే ముగిసి నిర్ణయం కావాల్సి వుండింది. అయితే అమెరికా, దానికి వత్తాసుగా కెనడా ఈ చర్చలను వ్యతిరేకించటంతో అవి నిలిచిపోయాయి. ఇప్పుడు అమెరికా తనతోపాటు సామ్రాజ్యవాద దేశాలు అనుసరిస్తున్న ఈ సుంకాల విధానాలనే ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యదేశాలన్నింటితో అమలు చేయించాలని పూనుకున్నది. దానినే వాణిజ్య ప్రోత్సాహ ఒప్పందం పేరుతో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలపై రుద్దేందుకు పూనుకుంది. బాలీ సమావేశంలో ఈ ఒప్పందాన్ని ఆమోదింపచేసే లక్ష్యాలతోనే అది సాగుతున్నది.

వాణిజ్య ప్రోత్సాహ ఒప్పందం వల్ల తక్షణమే ఎక్కువ లాభపడేది చైనా (కనుక ఈ ఒప్పందంపై అది మౌనంగా వుంది) కాగా దీర్ఘకాలంగా చూసినపుడు లాభపడేది సామ్రాజ్యవాద దేశాలే. సామ్రాజ్యవాద దేశాల సరుకులు ఆసియా, ఆఫ్రికా, లాటిన్అమెరికా దేశాలను ముంచెత్తుతాయి. ఈ దిగుమతుల ప్రవాహానికి ఏమాత్రం అడ్డంకులు కల్గించే సవరణలు సుంకాలకు చేసినా సభ్యదేశాలపై భారీ జరిమానాలు విధించే నిబంధనలతో ఈ 30పేజీల ఒప్పంద పాఠాన్ని నింపారు.

కాగా పేద సభ్యదేశాలకు రక్షణకల్పించటంలో మాత్రం కావాల్సినన్ని మెలికలు పెట్టారు. వాటిలో ఒకటే వ్యవసాయ సబ్సిడీలు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల నుండి ఎగుమతుల్లో ప్రధాన భాగం ప్రాథమికరంగ సరుకులే. అంటే వ్యవసాయ పంటలు, ఉత్పత్తులు, ఖనిజాలు తదితరాలు. వీటి ఎగుమతులకు తగినన్ని రక్షణలు కల్పించకపోగా, తాము వేలకోట్ల రూ॥లు సబ్సిడీలిస్తూ, పేద దేశాలిస్తున్న సబ్సిడీలను వాణిజ్యాన్ని వక్రీకరించేవిగా చిత్రించారు. ఆ విధంగా వ్యవసాయరంగ ఉత్పత్తుల ఎగుమతులలో అసమపోటీని ఏర్పరచి వాటిని దెబ్బతీసేందుకు పూనుకున్నారు.

అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న దేశాలను దెబ్బతీసి వాటిపై దోపిడీ ఆధిపత్యాన్ని నెలకొల్పుకునేందుకు సామ్రాజ్యవాదులు ప్రపంచ వాణిజ్య సంస్థను వేదికగా చేసుకున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థలో వుంటూ తమ వ్యవసాయరంగాన్ని కాపాడుకోవాలంటే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు ప్రపంచ వాణిజ్య సంస్థలో అనేక మార్పులు చేయటానికి కలిసికట్టుగా పూనుకోవాలి. బాలీ సమావేశం అజెండాను దృష్టిలో వుంచు కున్నప్పుడు కనీసం ఈ క్రింది మార్పులకోసమైనా అవి వెంటనే ప్రయత్నించాలి.

1). వ్యవసాయరంగానికి సామ్రాజ్యవాద దేశాలిస్తున్న సబ్సిడీలకూ, పేద దేశాలిస్తున్న సబ్సిడీలకు మధ్యనున్న వ్యత్యాసాన్ని తగ్గించాలి. లేదా

2). 1986–88 నాటి ధరలతో నిర్ణయించిన ఈ ఆర్ పిని నేటి ధరలకనుగుణంగా సవరించాలి. లేదా

3). ధాన్యసేకరణపై ఆంక్షలు లేకుండా చేయాలి.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికా దేశాలలోని ప్రభుత్వాలు ఇలాంటి మార్పులనే కోరుతున్నాయి. నేటి ధరలకనుగుణంగా ఈఆర్‌పిని సవరించాలని 43దేశాల తరఫున జి–33 సమావేశం కోరింది. దీనిని సామ్రాజ్యవాద దేశాలు తిరస్కరించాయి. సామ్రాజ్యవాద దేశాలిస్తున్న సబ్సిడీలను తగ్గించాలన్న అంశంపై చర్చలు కూడా సాగకుండా ఆపిన అమెరికా రెండేళ్ళలో పేద దేశాలిస్తున్న సబ్సిడీలు తగ్గించి వేయాలని పట్టుపట్టింది. దీనితో ఈ దేశాల ప్రభుత్వాలు పీస్ క్లాజు క్రింది 9ఏళ్ళు సమయం యిమ్మనికోరాయి. దీనికి అమెరికా నిరాకరించింది.

ప్రపంచ వాణిజ్య సంస్థ డైరెక్టరు రాబర్టు అజివిడో వివిధ దేశాలకు వెళ్ళి చర్చలు సాగిస్తున్నాడు. చివరకు అతను నవంబరు 26న ఒప్పందపు అంతిమ ముసాయిదాను విడుదల చేశాడు. 159 సభ్యదేశాల మంత్రులకు దానిని పంపించాడు. దీనిప్రకారం వ్యవసాయ రంగానికి సబ్సిడీలను 10శాతానికి తగ్గించేందుకు పీస్‌క్లాజు క్రింద పేదదేశాలకు 4ఏళ్ళ సమయమిచ్చారు. ప్రస్తుతం నిషేధించిన సబ్సిడీల సమస్యకు శాశ్వతపరిష్కారాన్ని కనుగొనేందుకు బాలీ సమావేశం తర్వాత చర్చించేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ అంగీకరించింది.

పేద దేశాలిస్తున్న వ్యవసాయ సబ్సిడీలను అమెరికా కోరుతున్న విధంగానే తగ్గిస్తారు. దానిపై ఒప్పందం జరుగుతుంది. ఆ తర్వాత సబ్సిడీల సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు చర్చలకు ప్రపంచ వాణిజ్యసంస్థ అంగీకరించింది. దీనిలో ఎన్ని మెలికలు పెట్టారో చూడండి. ప్రస్తుతం నిషేధించిన సబ్సిడీల సమస్యకు మాత్రమే శాశ్వతపరిష్కారం. అంటే ప్రస్తుతం పేద దేశాలిస్తున్న సబ్సిడీలను గురించే చర్చిస్తారు. సామ్రాజ్యవాద దేశాలిస్తున్న సబ్సిడీలు ఇందులోకిరావు. అదయినా ప్రపంచ వాణిజ్యసంస్థ అంగీకరించింది. అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలు కాదు. అవి ఈ చర్చలను వ్యతిరేకిస్తాయి. పేద దేశాలు పట్టుబడితే 10 శాతాన్ని 12 శాతానికి పెంచానంటూ "ఉదారత్వాన్ని" చూపుతాయి. ఏతావాతా పేదదేశాలు తమ వ్యవసాయ సబ్సిడీలను తగ్గించివేసుకుని, తమ వ్యవసాయరంగాన్ని నాశనం చేసుకుని పరాధీన మవుతాయి తప్ప, "శాశ్వత పరిష్కార"మన్నది ఎప్పటికీ చర్చల కోసం ఎదురుచూస్తూ వుండిపోతుంది.

దీనికి భారత ప్రభుత్వం అంగీకరించింది. ఈ చర్చలలో పాలుపంచుకున్న భారత సీనియర్ అధికారి "శాశ్వత పరిష్కారం అన్న భారత డిమాండును ప్రపంచ వాణిజ్య సంస్థ అంగీకరించటం భారత్ సాధించిన ఘన విజయం" అని అభివర్ణించాడు. **(బిజినెస్ స్టాండర్డు 28–11–2013)**

దీనికి కొన్ని రోజులముందు "శాశ్వతపరిష్కారం ఏర్పడేలోపు ఒక మధ్యంతర పరిష్కారం చూపకపోతే, ప్రపంచ వాణిజ్య సంస్థతో ఎలాంటి ఒప్పందానికి భారత్ అంగీకరించబోద"ని ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గర్జించారు. **(ది హిందూ 23–11–2013)**.

ఇక భారత వాణిజ్యమంత్రి ఆనంద్ శర్మ "పీస్ క్లాజును అంగీకరించబోయేదిలేదనీ" కోట్లాది ప్రజలు దారిద్రరేఖ దిగువనున్న భారత్‌కు ఆహారభద్రత ముఖ్యమ"నీ అన్నాడు. వారం తిరగకుండానే సామ్రాజ్యవాదులకు లొంగిపోయారు.

సామ్రాజ్యవాద దేశాల విధానాలనువ్యతిరేకిస్తున్న పేదదేశాలు సహజంగానే పెద్దదేశమైన భారత్ తమ పక్షాన నిలుస్తుందని ఆశించారు. జి–33 పేరిట అది పేదదేశాలను సమీకరించటాన్ని వారు ఆహ్వానించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పేదదేశాలకు నాయకత్వం వహించి ప్రపంచ వాణిజ్య సంస్థలో వాటి తరఫున పోరాడాల్సిన భారత పాలకులు శకుని పాత్రనే పోషించారు. సామ్రాజ్యవాదాలిస్తున్న సబ్సిడీలను తగ్గించాలన్న డిమాండును తిరస్కరించనప్పుడు దానిపై నిలచి వాదించకుండా పీసుక్లాజులో కాలవ్యవధిని పెంచమన్న డిమాండును భారతపాలకులు ముందుకు తెచ్చారు. చివరకు పేదదేశాలతో సంప్రదించకుండానే 4ఏళ్ళకు అంగీకరించారు. పైపెచ్చు అదే దాని విజయంగా తమభుజాలు తామే చరుచు కుంటున్నారు. ప్రపంచ పేదదేశాలు తమపై పెట్టుకున్న ఆశలను వమ్ముచేశారు. తమ దళారీ స్వభావంతో పేదదేశాలకు విద్రోహం చేశారు.

ప్రపంచ పేదదేశాలు, ప్రపంచ వాణిజ్య సంస్థ మసాయిదాను తీవ్రంగా నిరసిస్తున్నాయి. దేశంలోని ప్రజాస్వామిక శక్తులు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. వాణిజ్యశాఖపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ ఒప్పందం వల్ల జరిగే నష్టాలను పేర్కొని దీని నంగీకరించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అయినా భారత పాలకులు సామ్రాజ్యవాదుల ఆదేశాలను అమలు జరిపేందుకు పూనుకుంటున్నారు. బాలీ సమావేశం ముగిసేలోపున మరెన్ని నాటకాలాడతారో, మరెంత లొంగుబాటును ప్రదర్శిస్తారో గమనించాల్సిన అవసరముంది.

అయితే దానికి వేచిచూడకుండా భారత్‌తో సహా పేదదేశాల అభివృద్ధికి విఘాతం కలిగించి వాటి పరాధీనతను శాశ్వతం చేసి సామ్రాజ్యవాద దోపిడీ అణచివేతలకు అడ్డూ ఆపూ లేకుండా చేసే చర్యలకు భారతపాలకులు తలలూపుతున్న తీరును ప్రజల ముందు ఎండగట్టాలి. అన్నివిధాలుగా దేశ, ప్రజల ప్రయోజనాలకు హానికరమైన ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ బయటికి రావాలన్న డిమాండుతో ప్రజలను సమీకరించేందుకు సిద్ధమవ్వాలి. సామ్రాజ్యవాద దోపిడీని బలీయంచేస్తూ, అది యిస్తున్న తాయిలాలను ఘనవిజయంగా చూపుతున్న భారత పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలి. విశాల సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించాలి. ✶

## వంచనాత్మక శిల్పంలో ఆరితేరిన భారత పాలకులు

జి–33 వంటి అంతర్జాతీయ వేదికలలో శకునిపాత్రతో ప్రపంచ ప్రజలను మోసంచేస్తున్న భారత పాలకులు భారత ప్రజలను కూడా వంచించటంలో ఏమాత్రం వెనుకబడిలేరు. ఆహార భద్రతా చట్టం చేసి, 67శాతం దేశం ప్రజలకు సబ్సిడీ ధరలకు ఆహారమందించే బృహత్ పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పుకున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆహారభద్రతా పథకమని కూడా చెప్పుకున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు ఆహారభద్రతా పథకాన్ని తగ్గిస్తే సహించేది లేదంటూ బీరాలు పోయారు.

కానీ ఈ పథకాన్ని చూపెట్టి అమెరికా, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆహార భద్రతకు మీరు చేస్తున్న వ్యయం సబ్సిడీల పరిధిని దాటిందని, సబ్సిడీలను తగ్గించమనీ ఆదేశించాయి. ఇన్ని కోట్ల టన్నుల ఆహారధాన్యాన్ని సేకరించి నీ గోదాముల్లో ఉంచుకుంటే ప్రపంచానికి ఆహారధాన్యాల సరఫరా తగ్గి ప్రపంచ ప్రజల ఆహార భద్రతకు హానికలుగదా అని హెచ్చరించటంతో భారత పాలకుల కాళ్ళు గజగజా వణికిపోయాయి.

దీనితో మోకాలిదండవేసి సామ్రాజ్యవాద యజమానులను వేడుకున్నాయి. "నూతన చట్టం వల్ల ధాన్యసేకరణ–పంపిణీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం సాగుతున్న దానికంటే ఎక్కువ వుండబోద"ని విన్నవించుకున్నాయి **(ది హిందూ 14-10-2013)**. అంతేకాక దీనివల్ల ఆహారధాన్యాల ధరల్లో దేశంలో పెద్ద తేడా రాబోదని కూడా చెప్పుకున్నాయి. కేంద్రమంత్రి కె.వి.థామస్ దేశానికి తిరిగివచ్చిన తర్వాత పత్రికల వారితో నూతన చట్టం "సంక్షేమం అవగాహన నుండి హక్కుల అవగాహనకు మార్పు అనీ, ఇది మా వైఖరిలో మార్పు మాత్రమేననీ మేము వారికి వివరించాము" అని గంభీరమైన పదజాలంతో తమ భీరత్వాన్ని కప్పిపుచ్చుకోజూసాడు.

ఇంతకీ అసలు సంగతేమిటి? చౌకధరల దుకాణాల ద్వారా ఆహారధాన్యాలను పంపిణీ చేస్తున్నారు. వీటికి అనేక కేంద్ర పథకాలు, రాష్ట్ర పథకాల ద్వారా నిధులు వ్యయం చేస్తున్నారు. ఆహారభద్రతా చట్టం ద్వారా ఈ పథకాలన్నింటినీ రద్దుచేసి ఒకే పథకాన్ని ప్రవేశపెట్టారు. వీటన్నింటినీ కలిపిచూపి అతిపెద్ద పథకంగా చూపారు. భారత ప్రజలను ఈ గణాంకాలతో మోసం చేస్తారు కానీ తమ సామ్రాజ్యవాద యజమానుల ముందు మాత్రం నిజాన్ని చెపుతారు. ఆ నిజమేమిటి? ఈ పథకం వల్ల కొత్తగా పంపిణీ చేసే ధాన్యం అదనంగా ఉండదు. వాటికోసం అయ్యే ఖర్చుకూడా అదనంగా ఉండదు. ఇన్నాళ్లుగా తమ సంక్షేమంకోసమే యిస్తున్నామని ప్రజలకు చెప్పాము. ఇప్పుడు హక్కుగా యిస్తున్నామని చెబుతున్నామంతే! ఈ పథకం చూపి దీనిపై ఆంక్షలు విధించకండి అని వేడుకుంటున్నారు.

దళారీ పాలకుల ప్రజావంచనకు అవధులుండవుకదా!

## ఎండమావిగా... (మొదటిపేజీ నుండి)

ఏళ్ళతరబడి అన్ని కేసులలోనూ ఈవిధంగానే ఎందుకు జరుగుతున్నది? ఆధారపడదగ్గ సాక్ష్యాలను కోర్టుకు సమర్పించటంలో చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలు ఎందుకు విఫలమౌతున్నాయి? సరైన, తగిన సాక్ష్యాలు తన ముందుకు వచ్చే విధంగా తగిన చొరవను న్యాయవ్యవస్థ ఎందుకు చూపలేకపోతున్నది?

సరైన సాక్ష్యాధారాలు లభింపచేసే బాధ్యత తనమీద లేదని న్యాయవ్యవస్థ వాదించవచ్చు. కానీ అలాంటి శుద్ధ చట్టపర వాదనను దళితులపై సాగుతున్న దాడులు హత్యాకాండ కేసులలో అంగీకరించలేము.

దీనికి సంబంధించిన పండిత చర్చలోకి దిగకుండా ఈ ప్రశ్నలకు ఒక సామాన్యుడు సమాధానం యిచ్చాడు. ఆ సామాన్యుడు లక్ష్మణ్. రణబీర్‌సేన దాడిలో తన కుటుంబ సభ్యులు ఏడుగురిని కోల్పోయాడు.

ఆయన మాటలు: "58మందిని హత్యచేస్తే, అందులో ఎవరూ దోషులు కారు. కోర్టులు వారివే (భూమిహార్‌లవి), ప్రభుత్వమూ వాళ్ళదే. లాఠీలు వాళ్ళవే. పేదలకున్నదేమీలేదు".

ఎలాంటి సైద్ధాంతిక వివరణలూ లేకుండా 58 ఏళ్ళ వయస్సు యిచ్చిన జీవితానుభవంతో న్యాయం అందకపోవడానికి అసలు కారణాన్ని అతను వేలెత్తి చూపాడు. అదే, భూమి కలిగిన అగ్రవర్ణాలు భారత రాజకీయ – ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోకుండా, ప్రస్తుత అర్ధవలస – అర్ధ ఫ్యూడల్ వ్యవస్థలో దళితులకు న్యాయం జరుగుతుందనుకోవటం భ్రమల్లో ఉండిపోవటమే అవుతుంది. దళితుల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కొరకు పోరాడుతున్న శక్తులూ, దళిత సంఘాలూ, హక్కుల సంస్థలూ ఈ మౌలిక అంశాన్ని అర్థం చేసుకోవాలి. నేటి అర్ధఫ్యూడల్, అర్ధవలస వ్యవస్థే దళితులకు న్యాయాన్ని నిరాకరించేదిగా ఉంది. ఈ వ్యవస్థను సమూలంగా కూల్చివేయకుంటే దళితులకూ, పేదలకూ న్యాయం ఎండమావిగానే మిగులుతుంది. సామాజిక న్యాయం, సమానత్వం పగటి కలగానే వుండిపోతుంది. జనతా ప్రజాస్వామిక వ్యవస్థ మాత్రమే దళితులకూ పేదవర్గాలకూ న్యాయమందించగలదు; సామాజిక సమానత్వ సాధనకు బాటలు వేయగలదు. కనుకనే జనతా ప్రజాస్వామిక వ్యవస్థ కొరకు సంఘటిత పోరాటాలకు పూనుకోవాలి. ✶

# మహిళలపై అత్యాచారాలు - దోషులకు శిక్ష - వెల్లడైన ఛాందసవాదులు

డా॥అస్ఘర్ ఆలీ ఇంజనీర్

***2012 డిసెంబర్‌లో - ఢిల్లీలో విద్యార్థినిపై అత్యాచార సంఘటన అనంతరం 2013 జనవరి 'సెక్యులర్ పర్‌స్పెక్టివ్' సంచికలో ప్రముఖ లౌకిక, ప్రజాతంత్రవాది డా॥ అస్ఘర్ ఆలీ ఇంజనీర్ వ్రాసిన వ్యాసమిది. 2013 మే 14న అస్ఘర్ ఆలీ ఇంజనీర్ మరణించారు. ఆయన చనిపోయేముందుగా ఈ సమస్యపై ఆయన రాసిన చివరి వ్యాసం బహుశా ఇదేకావచ్చు. మహిళలపై అత్యాచార ఘటనలు పెచ్చుమీరుతున్న ప్రస్తుత నేపథ్యంలో ప్రాసంగికతవున్న ఆయన వ్యాసానికి అనువాదమిది - సంపాదకుడు***

**2012** డిసెంబర్ 16 నాటి 23 సం॥ల 'నిర్భయ' 'హత్యాచార' ఉదంతం - ప్రజాస్వామ్య భారతంలో మహిళల భద్రత పట్ల తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. వేలాదిమంది ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఢిల్లీ, ముంబయి వంటి పలు పట్టణాల్లో వీధుల్లోకి వచ్చి మహిళలపై జరుగుతున్న ఘోరాల్ని ఎలుగెత్తి ఖండించారు. చట్టాన్ని మరింత కఠినతరం చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

వీరి ఆందోళనను నేను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు పాల్పడే ఈ రకపు నీచమైన నేరాలను నిరోధించేందుకుగాను వీలైన అన్ని చర్యలూ ఖచ్చితంగా తీసుకోవాలనే దానిని నేను కూడా అంగీకరిస్తాను. పురుషుల లైంగికవాంఛకు మహిళలు బాధితులుగా వుంటున్న ఈ సమయంలోనే కొందరు ఛాందసవాద - హిందువులు, ముస్లిములు బాధితులపైనే ఆరోపణలు సంధిస్తూ వస్తున్నారు. దీనిని వివరంగా చర్చించాలి.

అనేక దొంతరల విషయంగానున్న ఈ సమస్యకు అనేక దొంతరల పరిష్కారమార్గం అవసరమవుతుందని మొట్టమొదట నేను నొక్కిచెప్పదలచుకున్నాను. సామాజిక విలువలు మరియు మనిషి స్వభావాల - విధ్వంసం మరియు పునర్నిర్మాణము అవసరమని, ఇది - స్త్రీ సమస్య పరిష్కారదిశలో ఒక ముఖ్యమైన ముందంజగా నేను భావిస్తాను. ఎంత కఠినమైన వైనప్పటికీ-కఠినశిక్షలే సమస్యను పరిష్కరించబోవటం లేదు. 'నిర్భయ' ఘటన అనంతరం ప్రతిరోజూ దేశవ్యాపిత నిరసనలు, ఆందోళనలు ఒకవైపు కొనసాగుతుండగానే పదుల సంఖ్యలో మహిళలపై అత్యాచారాలు, ఘోరమైన హత్యల ఘటనలను దినపత్రికలు వెలుగులోకి తెస్తూనేవున్నాయి. అవాంఛనీయమైనదేమీ జరగనట్లుగానే ఈ అత్యాచార నేరగాళ్ళు వీటికి పాల్పడుతూ వున్నారు.

అసలీ అత్యాచార నేరగాళ్ళు ఎవరు?, బాధితులు ఎవరు? అనేది మొదట చూద్దాం. వీరిని మనం 2 శ్రేణులుగా విభజించవచ్చు.

1) అత్యాచారనేరస్థులు ధనవంతులు, శక్తివంతులుగా వుండి బాధిత మహిళలు మధ్యతరగతి లేదా పేదలుగానో, దళిత లేదా మైనారిటీమహిళలుగానో ఉండటం
2) అత్యాచార నేరస్థుడు పేదవర్గంవాడై బాధితురాలు కూడా పేదవర్గానికి; లేదా ఇరువురూమధ్యతరగతి వర్గానికి; లేదా ధనిక వర్గానికి చెందినవారుగా వుండటం. దీనికి తోడు తండ్రి, బాబాయి, మావయ్య, సవతి తండ్రి వంటివారు ఈ నేరాలకు పాల్పడినవారుగా వుండటం

అత్యాచార నేరస్థుడు శక్తివంతుడై బాధితురాలు పేద మహిళగా ఉన్నప్పుడు నేరస్థుడు తప్పించుకునేందుకు అవకాశాలు మెండుగా వున్నాయి. నేరస్థులు - ప్రఖ్యాత న్యాయవాదులను నియమించుకోగలుగుతారు; పోలీసులను కొనివేయగలుగుతారు; కొందరు న్యాయమూర్తులను సైతం తమకనుకూలంగా మరల్చుకోగలుగుతారు! ఎంఎల్‌ఏ, ఎంపిలతో సహా అనేకమంది మన రాజకీయనేతలు ఇలాంటి నేరారోపణలు ఎదుర్కొంటున్నవారుగా వున్నారు. వారిని ఎవరు తాకగలరు? పేదలు, అధికారం లేనివారు మాత్రమే అత్యధికంగా శిక్షించబడతారు; ఒకవేళ ఈ నేరాలకు శిక్షగా కొందరు డిమాండ్ చేస్తున్నట్లు ఉరిశిక్షను ఆమోదిస్తే కూడా ఉరికొయ్యల మీదకు వెళ్ళేవారంతా పేదవారుగానే వుంటారు.

ఉరిశిక్ష అనేది ఏవిధంగానూ సమస్యను పరిష్కరించజాలదు. హత్యానేరానికిగానూ ఉరిశిక్షను శతాబ్దాలుగా అమలుచేస్తూ వస్తున్నప్పటికీ, హంతకులు రోజురోజుకీ పెరిగిపోతూనే వున్నారు. నిరుపేదలను, ఎలాంటి అండలేని నిస్సహాయులను, వేధింపులకు గురిచేసేందుకు, వారి నుండి అధికమొత్తంలో లంచాలు గుంజుకునేందుకు ఇది పోలీసుల చేతికి మరిన్ని అధికారాల్ని అందిస్తుంది. మరి, పోలీసులను నియంత్రించేవారెవరు? వందలాది నిస్సహాయ మహిళలు పోలీసు స్టేషన్లలో అత్యాచారాలకు గురవుతున్నారు. అలాగే కాశ్మీర్, మణిపూర్ మరియు అనేక ఇతర ప్రాంతాలలో సైనికబలగాల, సైనికాధికారుల చేతుల్లో అత్యాచారాలనేవి ఒక సాధారణాంశంగా మారిపోయింది. పోలీసు స్టేషనులో అత్యాచారాలకు పాల్పడిన ఒక్క పోలీసు అధికారి లేదా సైనికాధికారిగానీ శిక్షింపబడలేదు.

అదేవిధంగా ఈ దేశంలో దళిత, ఆదివాసీ మహిళలు అనేకమంది అగ్రకుల భూస్వాముల, పెత్తందారుల చేతుల్లో ప్రతిరోజూ అత్యాచారాలకు గురౌతూనే వున్నారు. అయినప్పటికీ ఢిల్లీలో ఒక్క నిర్భయ అత్యాచార ఉదంతాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ప్రదర్శనల తరహాలో వీరి విషయంలో ఎలాంటి ఆందోళనా ఏనాడూ వ్యక్తంకాలేదు! ఢిల్లీ ఘటనలో బాధితురాలు మధ్యతరగతికి చెందినదికాగా, నేరానికి పాల్పడినవారు మురికివాడకు చెందిన దిగువ మధ్యతరగతివారుగా వున్నారు. ఈ నేరాలకి పాల్పడిన వారు ఏ ఎమ్‌ఎల్‌ఏ లేదా ఎం.పి తాలూకో అయితే, ఏం జరుగుతుందో ఒక్కసారి ఊహించండి. ప్రసార మాధ్యమాలు మౌనం దాలుస్తాయి; ఎక్కడో ఓ మూల నాలుగులైన్ల వార్తకు పరిమితం చేస్తాయి; డజన్ల సంఖ్యలో మహిళా కార్యకర్తలు మాత్రమే నిరసనలలో పాల్గొని వుండేవారు.

అదేవిధంగా వందలాది మహిళలు - ప్రత్యేకించి మైనారిటీ మహిళలు మతఘర్షణల సందర్భంలో అత్యాచారాలకు గురిచేయబడుతున్నారు. ముంబయిలో 1992-93 మత ఘర్షణలలో బొరివిలీలోని నేషనల్ పార్కు సమీపంలో దాడులకు పాల్పడిన ఓ గుంపు తల్లీ, కూతుళ్ళపై ఒకేసారి అత్యాచారాలకు పాల్పడ్డారు. 1993 జనవరిలో, సూరత్ అల్లర్ల సందర్భంలో అనేకమంది ముస్లిము మహిళలను రోడ్లపక్కనే అత్యాచారాలు గావించినా మనము ఓ చిన్నపాటి నిరసన స్వరాన్ని కూడా వినలేకపోయాం. గుజరాతులో 2002లో వందలాదిమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. కేసార్‌బీ, బిల్‌క్విస్‌బానో వంటివారి విషయంలోనైతే, వారు గర్భవతులు కూడా! కేసార్‌బీ విషయంలోనైతే ఆమె పొట్టను చీల్చి గర్భస్థ పిండాన్ని బయటకుతీసి మంటల్లోకి విసిరివేశారు. అంతర్జాతీయ మహిళా హక్కుల బృందం మినహా మరెవరూ ఏమి జరిగిందో తెలుసుకునేందుకు కూడా సిద్ధం కాలేదు. పార్లమెంటులో ఒక సభ్యుడు ప్రజలందరికీ సంబంధించిన ఈ అంశాన్ని లేవనెత్తే ప్రయత్నం చేస్తే ఆనాటి ఎన్‌డిఏ ప్రభుత్వంలో రక్షణమంత్రిగానున్న సోషలిస్టు ఫెర్నాండేజ్ దీనిలో కొత్త అంశమేమిటని ప్రశ్నించాడు! మహిళలు ఈ దేశంలో ఎల్లప్పుడూ అత్యాచారాలకు గురౌతూనే ఉన్నారు.

మనం సమూలంగా ఫ్యూడల్ పితృస్వామ్య విలువలను ధ్వంసం చేయకుంటే, ఈ నేరాలను రూపుమాపటంలో మనం సాధించగలిగేది స్వల్పమే. పితృస్వామ్య సమాజంలో మహిళలు ఒకవైపున పురుషుని కోర్కెలను సంతృప్తిపరిచేవారుగా, మరోవైపున పిల్లలను కనే యంత్రాలుగా, భర్తలకు వండివార్చే వారిగా చూడబడుతున్నారు. ఆర్.యస్.యస్ ప్రముఖుడు మోహన్ భగవత్ 'ఒక ఒప్పందం ప్రకారం మహిళలు గృహసేవకులు మాత్రమేనని, ఆ ఒప్పందాన్ని ఎప్పుడైనా త్రోసిపుచ్చవచ్చని' పేర్కొన్నాడు. మహిళల పట్ల దీనికంటే దిగ్భ్రాంతికరమైన దృక్పథం ఉంటుందా? హిందూ వివాహ సాంప్రదాయంలో అగ్ని ప్రదక్షిణ చేసి వివాహాన్ని పవిత్రకార్యంగా ప్రతిన దీసుకుంటారనే అంశాన్ని కూడా అతను ప్రక్కనబెట్టాడు. దీని ప్రకారం చూసినా స్త్రీ పురుషుల మధ్య వివాహ బంధం పవిత్రమైందే తప్ప, యజమాని - బానిస సంబంధం మాత్రం కాదు.

మరో బిజెపి సభ్యుడు మహిళల సచ్ఛీలాన్ని గురించి రామాయణం ప్రబోధించిందని, వారు ఎప్పుడూ 'లక్ష్మణరేఖ' దాటరాదని సూచించాడు. అత్యాచార సమయంలో నిర్భయ, మంత్రోచ్ఛారణ చేసి వుండాల్సిందని, అత్యాచారనేరస్తులను సహోదరులుగా సంబోధించి వుండివుంటే వారు ఆమెను వదిలివేసేవారని అస్సారాం బాపు వ్యాఖ్యానించాడు. అహమ్మదాబాద్‌లో బిల్‌క్విస్‌బానో, తాను బాబాయిగా సంబోధించే పొరుగింటి అతని చేతుల్లో అత్యాచారానికి గురవబోయే ముందు ఆమె అతనికి ఆ విషయాన్ని గుర్తుచేసినా అతనేమీ లెక్కచేయకుండా అత్యాచారం గావించాడు. అస్సారాం బాపు చెప్పిన సూత్రం ఇక్కడ ఏమైంది?

మహిళల వేషధారణ హుందాగా వుండాలని, ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి చదువుకునే విద్యా వ్యవస్థను రద్దుచేయాలని, అదేదో కలిసిమెలిసి చదువుకునే విద్యావ్యవస్థే అత్యాచారాలకు కారణమన్నట్లుగా జమత్-ఏ-ఇస్లామీ అత్యాచారాల నిర్మూలనకు తానొక పరిష్కారమార్గంతో ముందుకొచ్చింది. జమత్ 19వ శతాబ్దానికి అంటే కో-ఎడ్యుకేషన్ ప్రారంభదినాల నాటికి తిరోగమించింది.

అత్యాచారాలు 'ఇండియా' (ఆధునిక పట్టణాల) లోనే జరుగుతున్నాయి కానీ 'భారత్' ((గ్రామాల)లో కాదు! అని మోహన్ భగవత్ మరో వ్యాఖ్య కూడా చేశాడు. దురదృష్టవశాత్తూ మోహన్ భగవత్ దృష్టిలో గ్రామీణ దళిత మహిళలకు గౌరవం లేదా హక్కులు లేదా మానాభిమానాలు వుండవు కాబోలు! చట్టపరమైన ఎలాంటి భీతీ లేకుండా అగ్రకులాల వారి చేతుల్లో గ్రామీణ ప్రాంతాలలో శతాబ్దాలుగా వారు అత్యాచారాలకు గురవుతూనే వున్నారు. అదేవిధంగా ఆదివాసీ మహిళలు కూడా! అగ్రకుల పెద్దమనుషుల కోర్కెలను సంతృప్తిపరిచేందుకే వారు అక్కడ వున్నారు! సాధారణంగా ఈ మహిళలే నేడు అక్కడి నుండి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళి అక్కడ కూడా అత్యాచారాల బారిన పడుతూవున్నారు.

కావున అన్ని మతాలలోని ఛాందసవాదులు బాధిత మహిళలనే దోషులుగా నిలబెడ్తున్నారు గానీ, వారిపై అత్యాచారాలకు పాల్పడిన పురుషులను మాత్రం కాదు. దురదృష్టవశాత్తూ ఛాందసవాదులలో ఒక్కరంటే ఒక్కరు కూడా అత్యాచారాలకు కారకులైన పురుషులను దోషులుగా నిలబెట్టలేదు. ఆడవారిని అదుపులో పెట్టి తీరాలంటున్నారు. 'రెచ్చగొట్టే వస్త్రధారణతో అత్యాచారాలు చేయమని ఆహ్వానిస్తుంటే మగవారేం చేయగలుగుతారు?' అంటున్నారు. నిన్నటిదాకా హుందా అయిన దుస్తులు ధరించి బయటకొచ్చిన మహిళను కూడా, ఆమె రెచ్చగొట్టే విధంగా వుంది కనుక ఆమెను అదుపులో వుంచాలన్నారు. ఏమైనా, ఏ దుస్తులు రెచ్చగొట్టేవిగా వున్నాయనేది నిర్ణయించేదెవరు? సాంప్రదాయ హిందువుల ప్రకారం మహిళ తన చీర కొంగును తలపై నుండి కప్పుకోవాలి. సాంప్రదాయ ముస్లిముల ప్రకారం మహిళ తల నుండి పాదాల వరకు (కళ్ళు మినహా) కప్పివుంచే బురఖా ధరించాలి. కనుక ఫలానా దుస్తులు రెచ్చగొట్టేవనో, లేదా 'హుందా' అయినవనో నిర్ణయించేదెవరు?

వాస్తవానికి మహిళలను దోషులుగా నిలపటమో, లేక వారి దుస్తులను, కదలికలను నియంత్రించటానికో బదులుగా అత్యాచారాలను అదుపుచేయటానికి అనేక చర్యలు చేపట్టాల్సిన అవసరం వుంది. ఈ సమస్యకు మూలం లైంగిక వ్యామోహంకాగా దీనిని అనేక విధాలా ఖచ్చితంగా అదుపుచేయవచ్చు. మనం తప్పనిసరిగా పితృస్వామ్య విలువల వ్యవస్థను ధ్వంసం చేసి స్త్రీ, పురుషులిరువురికీ సమానగౌరవం వుండే, స్త్రీని పూర్తిస్థాయిలో గౌరవనీయమైన వ్యక్తిగా పరిగణించే సార్వజనీన విలువల వ్యవస్థను పునర్నిర్మించుకోవాలి.

మహిళ - పురుషుడి కామవాంఛలను తీర్చే సాధనమో లేక ఇంటిచాకిరీ చేసే, పిల్లలను కని పెంచే యంత్రమో కాదు. బిడ్డలకు జన్మనిచ్చే కర్తవ్యంతో పాటు, పురుషులతో సమానంగా మహిళ అన్ని మానవ కార్యకలాపాలను నిర్వర్తించగలుగుతుందనే మర్యాద, గౌరవాలతో వారితో వ్యవహరించాలి.

విద్యాసంస్థలో పాఠ్యపుస్తకం నుండి, కుటుంబం నుండి ఈ విలువల వ్యవస్థ పునర్నిర్మాణం ప్రారంభం కావాలి. ఈనాటి కుటుంబం మరియు విద్యావ్యవస్థ పూర్తిగా పితృస్వామ్య, ఫ్యూడల్ స్వభావాన్ని కలిగి వున్నాయి. ఈ రెండు వ్యవస్థలను సమూలంగా మరమ్మత్తు చేయాలి. సార్వజనీన విలువలతో వీటిని తీర్చిదిద్దాలి. దురదృష్టవశాత్తూ మన విద్యావ్యవస్థ మొత్తంగా వ్యక్తిత్వ వికాసం కలిగించటానికి బదులుగా వ్యక్తిగత కెరీర్‌ను పెంచే దృష్టిని కలిగివుంది. పితృస్వామ్య విలువలు దీనిలోనూ మగ పిల్లలకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి. చట్టాలలో చేయవలసిన సవరణలతోపాటు లైంగిక అసమానతలకు తావీయని విధంగా మన పాఠ్యపుస్తకాలన్నింటినీ సరిచేయాలి. లైంగిక సమానత్వాన్ని నొక్కిచెప్పే విధంగా మన పాఠ్యపుస్తకాలలో మార్పులు చేయాలి. అదేవిధంగా, అంతేవోతాదులో మహిళలందరినీ గౌరవించే విధంగా, జీవన గమనానికి మూలం మహిళ అని చాటిచెప్పేవిధంగా కుటుంబ విలువలలో ఖచ్చితమైన మార్పులు రావాలి. భర్తను కుటుంబంలో ఉన్నతుడుగానో లేదా కుటుంబాధిపతిగానో కాకుండా సమాన భాగస్వామిగా మాత్రమే గుర్తించాలి.

అదేవిధంగా మన పోలీసు వ్యవస్థనూ, యావత్తు చట్ట అమలు శాఖలన్నింటినీ స్త్రీల సమస్యలపట్ల స్పందించగలిగే విధంగా, స్త్రీ, పురుష సమానత్వాన్ని పాటించగలిగే విధంగా ప్రక్షాళన చేయాలి. పురుషాధిపత్యాన్ని సూచించే మన భాషను కూడా మార్చుకోవాల్సిన సరైన సమయమిది. మహిళను సంతలో ప్రదర్శనకు నిలిపిన వస్తువుగా చూపరాదు. ఇది దానంతట అదే ఓ వికృత మానసిక స్థితికి గురిచేస్తుంది. వ్యాపార పరిశ్రమనంతా మహిళల స్త్రీత్వంపై ఆధారపడి సాగిస్తున్నారు. ఆమె ధరించే దుస్తులపై ఆంక్షలు విధించటానికికంటే, దీనిలో చాలా జరూరుగా మార్పు తీసుకోవాల్సివుంది. యావత్తు ప్రసార మాధ్యమాలన్నీ ఈ విషయంపై మౌనం దాలుస్తున్నాయి. ఎందుకంటే కామోద్రేకాలను రెచ్చగొట్టే మాంసపు ముద్దగా, అర్ధనగ్నంగా మహిళలను ప్రదర్శించే వ్యాపార పరిశ్రమ తద్వారా ప్రసార సాధనాలు మహిళల లైంగిక దోపిడీపై అత్యధికంగా లాభపడుతూండటమే దానికి కారణం!

కనుక శిక్షలను కఠినతరం చేయటం ఏమేరకు దోహదపడుతుందో లేదో గానీ (అత్యాచార కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో విచారించటం ఖచ్చితంగా ఉపయోగకరంగా ఉంటుంది) మన విలువల వ్యవస్థను సమూలంగా మరమ్మత్తు చేయటం ద్వారా మాత్రమే ఖచ్చితంగా పరిస్థితిలో మార్పుకు తోడ్పడుతుంది. సామాజిక దృష్టికోణంలో తీసుకోవాల్సిన ఈ మార్పు అత్యంత ఆవశ్యకమైంది. అదేవిధంగా కులం, వర్గంతో నిమిత్తం లేకుండా మహిళలంతా గౌరవానికి అర్హులే. దళిత, ఆదివాసీ, మైనారిటీ మహిళలపై సాగుతున్న అత్యాచారాలపట్ల ఉపేక్ష వహించకుండా వ్యవహరిద్దాం. అత్యాచారాలకు, దాడులకు ఆస్కారంలేని ఓ స్వేచ్ఛాయుత సమాజాన్ని మనం సాధించుకోవాల్సి వుంది. ✡


**అణచబడ్డ దళితులంతా**

**తిరగబడండి**




పేజీలు : 144

వెల : రు. 50/-

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# మూలనపడ్డ బాలికా సంరక్షణ పథకం

**పేదలను** పేదరికంలోనే ఉంచటం, వారిని యాచకులుగా, తమచుట్టూ తిరిగేవారిగా చేయటం, తద్వారా తమ రాజకీయ - అధికార ప్రయోజనాలకు వారిని ఓట్ల బ్యాంక్‌లుగా మార్చుకోవటం పాలకుల విధానంగా మారింది. అందుకోసం పేదలకు ఆశపెట్టే, మోసపుచ్చే సంక్షేమపథకాలను ప్రవేశపెట్టడం, మోసపు మాటలు చెప్పటం చేస్తున్నారు. గరీబీహటావో, గ్రామీణ ఉపాధి హామీ పథకం, కిలో బియ్యం రూపాయి పథకం, ఇందిరా గృహనిర్మాణ పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజులు రీ ఎంబర్స్‌మెంటు వంటి పథకాలు అందులో భాగమే. ఇవికాక స్త్రీల కోసమే అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు, పెడుతున్నట్లు, వారి ఉద్ధరణకు కృషిచేస్తున్నట్లు, అందుకోసం గర్భవతులకు, బాలింతలకు పోషకాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రసవించిన స్త్రీలకు ఆర్థిక సహాయం, వితంతు పెన్షన్, డ్వాక్రా గ్రూపులు, బాలికలకు ఉచిత విద్య, బాలికా సంరక్షణ పథకం, బంగారు తల్లి పథకం మొదలైనవి అందుకు అనుగుణంగా చేసినవే. ఈ పథకాలనైనా సమగ్రంగా సక్రమంగా అమలు జరుపుతున్నారా అంటే అదీలేదు. అనేక పథకాలను మధ్యలోనే ఆపివేస్తున్నారు.

స్త్రీల ఓట్లను కొల్లగొట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం హైస్కూల్స్‌లో చదువుకొనే బాలికలకు (దూరంగావున్న స్కూల్స్‌కి వెళ్ళేందుకు) ఉచితంగా సైకిళ్ళు ఇస్తానని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడక్కడ కొద్దిపాటి సైకిళ్ళు యిచ్చి, ఆ తర్వాత ఆ పథకాన్ని అటకెక్కించింది. ఆ విధంగా అది కనుమరుగైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికా సంరక్షణ పథకానికి కూడా ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడనుంది.

పేద కుటుంబాల ఆడపిల్లల సంక్షేమమే ధ్యేయంగా 2005 సం॥లో కాంగ్రెస్ ప్రభుత్వం బాలికా సంరక్షణా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాల్లో ఒక ఆడపిల్ల ఉంటే లక్షరూపాయలు, ఇద్దరు పిల్లల తర్వాత ఆపరేషన్ చేయించుకుంటే ఒక్కో బాలికకు 30వేల చొప్పున అందచేయటమే ఈ పథకం ఉద్దేశ్యం. ఈ మొత్తాన్ని బాలికకు 20సంవత్సరాలు నిండిన తర్వాత అందచేస్తారు. ఇందుకోసం ఎల్.ఐ.సీ కి ప్రీమియం క్రింద ప్రతి సంవత్సరం ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ పథకం క్రింద 5లక్షల 60వేల మంది చిన్నారులు లబ్ధిదారులుగా నమోదు అయ్యారు. ఈ సంఖ్యను గమనిస్తేనే లబ్ధిదారుల ఎంపిక చాలా పరిమితంగా జరిగిందని, ఇంకా లక్షలాదిమందికి ఈ పథకం అందుబాటులోకి కూడా రాలేదనేది స్పష్టమౌతుంది.

ఆర్థిక సహాయం అందచేయటానికి విధించిన కాలపరిమితిని గమనిస్తేనే దాని డొల్లతనం అర్థమౌతుంది. పేద కుటుంబాల్లోని పిల్లలను ముఖ్యంగా బాలికలను చదివించుకోవటం, వారి సంరక్షణచర్యలు తీసుకోవటానికి ప్రధానమైనది ఆర్థికం. ఆర్థిక ఇబ్బందుల వలనే అలాంటి విధానాలు తల్లిదండ్రులు తీసుకోలేకపోతున్నారు. బాలికా సంరక్షణ పథకం ద్వారా బాలికలను ఉద్ధరిస్తామని చెబుతున్నారు. కానీ 20 సంవత్సరాల తర్వాత (అదీ నామమాత్రమే) ఆ సహాయం ప్రభుత్వం అందచేస్తుంది. ఈ 20 సంవత్సరాల్లో బాలికల పరిస్థితి ఏమిటి? వారు చదువుకోవాలన్నా, వాళ్ల కాళ్ళమీద వారు నిలబడే విధంగా తర్ఫీదు పొందాల్సి ఉంటుంది. అందుకు వారికి ఆర్థిక వసతి ఉండాలి. అది లేకుండా వారు ఆవిధంగా తయారుకాలేరు. వారి కుటుంబాలకు ఆ పరిస్థితిలేదు. 20 సంవత్సరాల తర్వాత యిచ్చే సహాయం వారికి ఆ అవకాశం కల్పించదు. వారి పెండ్లి చేయటానికై ఆ సహాయం ప్రస్తుత పరిస్థితుల్లో ఉపయోగం తక్కువగానే ఉంటుంది. ఒక్క ఆడపిల్ల ఉంటే లక్ష అన్నదానికి కుటుంబనియంత్రణ లక్ష్యంగా పాలకులు పెట్టుకొన్నారు. అందుకే ఇద్దరు పిల్లలు ఉంటే పథకం పాలసీని 30వేలకు కుదించారు. పిల్లలు ఎవరైనా ఒక్కరు లేక యిద్దరు అన్నది ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఎక్కువ కుటుంబాల్లో యిద్దరు పిల్లలకు పరిమితం చేసుకొంటున్నారు. అందువలన ఇద్దరు ఆడపిల్లలు ఉంటే స్కీమ్ పాలసీని తగ్గించాల్సిన అవసరంలేదు. అలాంటి కుటుంబాలకే ఇంకా ఎక్కువ ఆర్థికపరమైన తోడ్పాటు అవసరం ఉంటుంది. పేద కుటుంబాల ప్రయోజనమేమిటో పట్టని పాలకులు అందించే నామమాత్ర సహాయాన్ని కూడా ఆ పేరుతో తగ్గించి వేస్తున్నారు.

ఉన్న పథకాలను ఆపివేసి, మరో పేరుతో ఆ పథకాలనే అటూ ఇటూ మార్చి కొత్త పథకాలుగా పాలకులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు బాలికా సంరక్షణా పథకానికీ అదే పరిస్థితి ఏర్పడింది. ఈ పథకం కొనసాగుతుండగానే ఈ సంవత్సరం (2013)లో కొత్తగా 'బంగారుతల్లి' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది బాలికా సంరక్షణ పథక నమూనానే. కాకపోతే ప్రతిసంవత్సరం ఈ పథకం క్రింద ఆడపిల్ల పుట్టిన దగ్గర నుండి డిగ్రీ పూర్తి అయ్యేవరకు కొంతమొత్తాన్ని అందచేస్తారు. 20సం॥లో 2,16,000 బాలిక కుటుంబానికి అందుతుందని దానికి గణాంకాలు పొందుపర్చారు. ఇది తెల్లకార్డులు ఉన్నవారందరికీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఒక ఆడపిల్లకే వర్తిస్తుంది. ఇద్దరు ఆడపిల్లలు ఉంటే వర్తించదు. పేద కుటుంబాల ఆడపిల్లలకు ప్రతి సంవత్సరం వెయ్యి, రెండువేలు, మూడువేలు యిస్తే ఆ ఆడపిల్ల సమస్యలు అన్నీ తీరిపోయినట్లుగా పాలకులు భావించటం పేదరికాన్ని అపహాస్యం చేయటమే. ప్రభుత్వం యిచ్చే డబ్బుతో పసిపిల్లగా ఉన్నప్పుడు అందించవలసిన పోషకాహారానికి ఒక్క నెలకు కూడా సరిపోదు. బడిలో చేరిన తర్వాత అందే డబ్బు పుస్తకాలకు, చదువుకి కావాల్సిన ఇతర అవసరాలకు కొద్ది సంవత్సరాలు సరిపోవచ్చు. దీన్ని గమనిస్తే ఆడపిల్ల బాధ్యత తల్లిదండ్రుల పైనే ఉందనేది ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. రెక్కల కష్టంపై కుటుంబాన్ని పోషించే తల్లిదండ్రులు, తమ పిల్లకి వైద్యం, పోషకాహారం అందించలేకపోవటమే కాక, పరిశుభ్రమైన వాతావరణంలో పెంచటం, చదువుకి కావాల్సిన వసతులు ఏర్పాటుచేయటం వారికి సాధ్యం కాదు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చదవుని మధ్యలోనే ఆపించే పరిస్థితి ఏర్పడుతుంది. వీటన్నిటినీ గమనిస్తే, బంగారుతల్లి పథకం ఆడపిల్లకు సంరక్షణ యిస్తుందని భావించటం సాధ్యం కాదు.

బాలికా సంరక్షణ పథకం ఉండగానే, బంగారు తల్లి పథకం ఎందుకు ప్రవేశపెట్టిందో ప్రభుత్వం చెప్పటంలేదు. ఆ పథకం ద్వారానే, బంగారుతల్లి పథకం ద్వారా అందించే మొత్తాన్ని చేయవచ్చు. బంగారు తల్లి పథకం ప్రవేశపెట్టినప్పుడు, బాలికా సంరక్షణ పథకం అమలుజరిగేది, జరగందీ ప్రభుత్వం చెప్పలేదు. ఆ పథకాన్నీ ప్రక్కనబెట్టే విధానం ప్రభుత్వం చేపడుతున్నదని దాని ఆచరణ తెలియచేస్తున్నది. 2011 వరకు ప్రీమియం చెల్లించి, లబ్ధిదారులకు బాండ్లు అందచేసిన ప్రభుత్వం, 2011-12, 2012-13, 2013-14లో ఒక నెలలో దాదాపు 80వేల మంది కొత్తగా బాలికా సంరక్షణ పథకంలో పేర్లు నమోదుచేసుకొన్న వారికి ప్రీమియం చెల్లించి బాండ్లు అందచేయాలి. అలా చేయకపోగా ఆరు సంవత్సరాలుగా ప్రీమియం చెల్లిస్తున్నవారికి కూడా, చెల్లింపులు ఆపివేసింది. ఫలితంగా ప్రీమియం చెల్లింపుల బకాయి 181 కోట్లకు చేరింది. బకాయి ప్రీమియం చెల్లించాలని శిశుసంక్షేమశాఖ, ఎల్.ఐ.సి. ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పథకం ఆగిపోయినట్లేనని, లబ్ధిదారులకు ప్రయోజనం లేనట్లేనని భావించవలసి వస్తుంది.

# ఉపశమన పథకాలకు సైతం తిలోదకం

దేశంలో, రాష్ట్రంలో పేదరికం విలయతాండవం చేస్తున్నది. ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి నివేదిక ప్రకారం భారతదేశంలో 60కోట్ల మంది పేదలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 60శాతం మంది పేదరికంలో ఉన్నారు. రెక్కలు ముక్కలు చేసుకొన్నా రోజు గడవటం వీరికి గగనమైపోతున్నది. వీరికి వైద్యం, పిల్లల చదువు అందని పండులా తయారైంది. కుటుంబ పోషణ నిమిత్తం ఏదో ఒక పనిలోకి పిల్లలను పంపక తప్పటంలేదు. బడికి పంపినా పిల్లల చదువు మధ్యలోనే ఆగిపోతున్నది. ఫ్యూడల్ సంస్కృతి, భావజాలం, ఆధిపత్యం ఇప్పటికీ స్త్రీలను అణచివేతకు గురిచేస్తున్నాయి. అనేక దౌర్జన్యాలకు బలిచేస్తున్నాయి. ఆడపిల్ల కుటుంబానికి భారమనే భావన కొనసాగుతున్నది.

పేదల జీవితాలు ఇంత దుర్భరంగా మారటానికి, స్త్రీలు అణచివేతకు గురికావటానికి, స్వశక్తితో బ్రతికే పరిస్థితి లేకపోవటానికి గల మౌలిక కారణాల జోలికి, వాటి పరిష్కారానికి పాలకులు వెళ్ళటంలేదు. అరకొర సహాయం అందించే తాత్కాలిక ఉపశమన పథకాలకే పరిమిత మౌతున్నారు. అందుకు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న భూస్వాముల, బడాపెట్టుబడిదారుల ప్రయోజనాలే వారికి ముఖ్యం. గ్రామీణ-పట్టణపేదలు భూస్వాముల, బడా బూర్జువాల దోపిడీకి గురౌతున్నారు. తాము సంపదలు సృష్టిస్తున్న భూమి, పరిశ్రమలపై వారికి హక్కులేకపోవటం వలన, సంపదలన్నీ దోపిడీ వర్గాలపరం కావటం, వారి సంపదలు పెరగటం, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు శ్రమకు తగ్గ ఫలితంలేని వేతన కూలీలుగా నికృష్టమైన జీవితాలు గడుపుతున్నారు. పేదల పరిస్థితి మారాలంటే వారిపై భూస్వాముల ఆధిపత్యాన్ని బద్దలు కొట్టే భూసంస్కరణల ద్వారా భూ పంపిణీ జరగాలి, పరిశ్రమల్లో కార్మికుల భాగస్వామ్యం, శ్రమకు తగ్గ వేతనం లభించాలి. వీటిని నేటి పాలకులు అమలు జరపరు. అందుకే పేదలను, పేదలుగానే ఉంచే విధానాలు అమలు జరుపుతున్నారు. ప్రజలను పరిహసించే పథకాలు ప్రవేశపెడుతున్నారు.

పేదలను, పేదలుగానే ఉంచే పాలకుల వర్గ స్వభావాన్ని గ్రహించి, తాము సృష్టించే సంపదలపైన, భూమి, పరిశ్రమలపైన గ్రామీణపేదలు, కార్మికులు తమ హక్కును సాధించుకోవాలి. అందుకు మిగతా ప్రజలను కలుపుకొని నూతన ప్రజాతంత్ర విప్లవం ద్వారా భూస్వామ్యవర్గాన్ని, సామ్రాజ్యవాదాన్ని, బడా బూర్జువా వర్గాన్ని కూలద్రోయాలి. అప్పుడే పేదల పేదరికం తొలగిపోతుంది. పురుషులతోపాటు స్త్రీలు అన్నిరంగాల్లో ముందుకుపోగల్గుతారు. ✡

# రూపాయి విలువ పతనం మరియు ధరల పెరుగుదలలను నిరసిస్తూ సదస్సు

**వెంకటగిరి, 20-10-13 :**

**'రూపాయి** విలువ పతనం - సామాన్య, మధ్య తరగతి ప్రజలపై దాని ప్రభావం' అనే అంశంపై పి.డి.ఎస్.ఓ, ఎన్.వై.ఎస్ సంస్థలు సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. స్థానిక ఆర్.వి.యం ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ సదస్సులో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె.కిషోర్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా డాలర్‌విలువ పెంచుకుని మన దిగుమతులకు అధికంగా ధరలు నిర్ణయించడం ప్రతిరంగంపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. నేడు నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోల్, సిమెంటు ధరలు పెరగడానికి, విదేశీ కంపెనీలకు మార్కెట్ చూపించడానికి దిగుమతులకు అవకాశం కల్పిస్తున్న పాలకుల విధానాలే ఈ దుస్థితికి కారణమని విమర్శించారు. విద్యుత్ ఉత్పాదనకు కావలసిన బొగ్గు దిగుమతి చేసుకోవడంతో, విద్యుత్ వినియోగదారుల నుండి ఇంధనపు సర్దుబాటుచార్జీ-రూపాయి విలువ పతనం వలన ఎక్కువ మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నారని వివరించారు. మందులకవసరమైన మూల రసాయనంలో 50శాతం విదేశాల నుండి దిగుమతి అవుతున్నదని కనుక తరచూ మెడిసిన్స్(మందుల) ధరలను పెంచుతున్నారని, సామాన్యులపై భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ బస్తా తయారీకి 80 రూ॥ ఖర్చవుతున్నా 350రూ॥లకు అమ్ముతున్నారంటే ధర నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని దుయ్యబట్టారు.

నవయువసమాఖ్య రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ ఎల్.లక్ష్మీరెడ్డి మట్లాడుతూ కృష్ణా-గోదావరి బేసిన్‌లో చమురు నిల్వలను వెలికితీసి శుద్ధిచేసే పనిని ఓ.ఎన్.జి.సి.కి ఇవ్వకుండా డి6 బావిని రిలయన్స్ కంపెనీకి ఇవ్వడంతో లక్షల కోట్ల రూ॥ల ప్రజల సంపద రిలయన్స్ చేతికెళ్ళి ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారని, ప్రజలపై మాత్రం గ్యాస్, డీజిల్, పెట్రోల్ భారం నానాటికీ మోపుతున్నారని, పాలకుల దళారీ విధానాలను ప్రతిఒక్కరూ ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతుకి గిట్టుబాటు ధర ఇవ్వకపోయినా కిలో బియ్యం 30 రూ॥ నుండి 50 రూ॥ సం॥ కాలంలోనే చేరిందన్నారు. రూపాయి విలువ పతనంతో పేదా, సాదా, మధ్యతరగతి ప్రజానీకపు జీవితాలు కునారిల్లిపోతున్నాయని అన్నారు. విద్యార్థులు, యువకులు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళనకు పూనుకోవాలని పిలుపునిచ్చారు.

పి.డి.ఎస్.ఓ జిల్లా కన్వీనర్ జి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల విద్యార్థుల చదువులు కూడా భారమై చదువులకు స్వస్తి పలకాల్సి వస్తోందని విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్ కంపెనీల కబంధ హస్తాల నుండి బయటకు తెచ్చి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సదస్సుకి ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షులు ఆర్. పెంచలయ్య అధ్యక్షతవహించగా సదస్సులో జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, నాయకులు పి.మోహన్, మనోహర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✡



English Organ of Central Committee of CPI (ML)

# ఆర్టీసీ ఛార్జీల పెంపుకు నిరసన



బందరు ఆర్టీసీ బస్టాండు ఎదుట ధర్నా

**బందరు, 6-11-13 :**

పెంచిన ఆర్టీసీ బస్సుఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. నిర్వహణ అసమర్థత కారణంగా తలెత్తుతున్న నష్టాలన్నింటినీ, డీజిలు పెంపు సాకుతో భారాలను పేద ప్రజలపై మోపటాన్ని సంఘం జిల్లా నాయకులు కా॥పామర్తి అంజమ్మ తీవ్రంగా ఖండించారు. గత ఏడాది సెప్టెంబరులో ఆర్టీసీ ఛార్జీలను పెంచిన ప్రభుత్వం మళ్ళీ ఇప్పుడు మరోసారి ఛార్జీలను పెంచటం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రయాణీకులపై మరింత భారాన్ని పెంచుతోందన్నారు. ఇంతేగాక, మళ్ళీ డీజిల్ ఛార్జీలు పెరిగితే ఛార్జీల పెంపు మరోసారి వుందంటూ ప్రకటించటాన్ని ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ముచ్చు సుధాకరరావు తీవ్రంగా ఖండించారు. తక్షణం ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ శ్రీప్రీతి; ఎన్‌వైయస్ నాయకులు హనుమంతు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**పిడుగురాళ్ళ, 7-11-13:**

రాష్ట్రప్రభుత్వం ప్రజలపై మోపిన ఆర్‌టిసి ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేస్తూ, పిడుగురాళ్ళలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో 7-11-13న ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥నీలాద్రి రాంబాబు మాట్లాడుతూ ఆర్‌టిసి యాజమాన్యం డీజిల్‌ధర పెరిగిందని, సంస్థ అప్పుల్లో ఉందని చెప్పి ప్రజలపై ఛార్జీల భారాన్ని మోపడం దుర్మార్గమని, సంవత్సరానికి సుమారు 600 కోట్ల రూపాయల భారాన్ని వేయనుందని; గత సంవత్సరం పెంచిన ఛార్జీలకు తోడు మరలా ఇప్పుడు 10% నుండి 20% వరకు పెంచడంవలన పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రయాణం మరింత భారంగా తయారయ్యిందని, కనుక రాష్ట్రప్రభుత్వం పెంచిన ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎం.నిర్మల మాట్లాడుతూ ఆర్‌టిసి నష్టాల్లో కూరుకుపోవడానికి ముఖ్యకారణం రాష్ట్రప్రభుత్వమేనని, అందరం కలిసి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నాయకులు కె.శ్రీను, రైతుకూలీసంఘం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ✡



Hindi Organ of Central Committee of CPI (ML)

# సంక్షోభంలో పత్తిసేద్యం

## సామ్రాజ్యవాదుల, బడా వ్యాపారుల అదుపులో ధరల నిర్ణయం

**పత్తి** సేద్యం సమస్యల వలయంగా మారింది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు సృష్టించే నష్టాలు; మరొకవైపు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు; ఇంకొకవైపు పత్తి ధరలను శాసిస్తున్న దేశీయ – అంతర్జాతీయ బడా పెట్టుబడిదారీ వర్గం! ఫలితంగా రైతాంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

వరి సేద్యం తర్వాత పత్తి పంటే రాష్ట్రంలో ఎక్కువగా సాగుతున్నది. ఆశ–నిరాశల మధ్య, మరో ప్రత్నామ్నాయ పంట కన్పించక రైతాంగం పత్తిసేద్యం చేస్తున్నారు. పత్తి దిగుబడులు పెరగకపోవటం, సేద్యపు ఖర్చు గణనీయంగా పెరగటం, న్యాయమైన ధర లభించకపోవటం, గిట్టుబాటు ఆదాయం రాకపోవటం, కొన్ని సందర్భాల్లో సేద్యపు ఖర్చులు కూడా రాని పరిస్థితి రైతాంగానికి ఏర్పడుతోంది. ఇతర పంటలలాగానే పత్తిపంటకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం మద్దతు ధర ప్రకటిస్తున్నది. ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర రైతాంగ ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. 2006 సం॥ దాకా గత సం॥ ధరకు 10, 20 రూపాయలు పెంచి మద్ధతుధరను ప్రభుత్వం ప్రకటిస్తూ వస్తున్నది. ఈ పెంపుదల అలంకార ప్రాయమే. మద్దతుధర అనేది ఉత్పత్తి ఖర్చులు, రైతు కుటుంబ అవసరాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయించాలి. అలా ఇంతవరకు జరగటంలేదు. ప్రభుత్వం ప్రకటిస్తోన్న మద్దతు ధరపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తటంతో గత నాలుగుసంవత్సరాల నుండి వంద, రెండు వందల రూపాయల పెంపుతో మద్దతు ధరను ప్రకటిస్తున్నది. ఇది కూడా నిరుపయోగమే. పెరుగుతున్న పంట ఖర్చులను దృష్టిలో పెట్టుకొంటే ఇది పెంపుదలకానే కాదు. బహిరంగ మార్కెట్‌లో బడా సిండికేట్ వ్యాపారవర్గం, తమ ఇష్టానుసారం పత్తికొనుగోలు ధరలను నిర్ణయిస్తున్నది. రైతాంగం పంట పండించిన తర్వాత ధర పెంచటమనే విధానాన్ని ప్రభుత్వం అవలంబిస్తోంది. దీనిని సొమ్ముచేసుకునేది వ్యాపార వర్గం, భూస్వామ్య వర్గమే. పెంచినరేటుతో ఆశపెట్టి మరుసటి సంవత్సరం పత్తిసాగు వైపుకి రైతాంగాన్ని మళ్ళిస్తున్నారు.

### పెరుగుతున్న పంట ఖర్చులు – గిట్టుబాటుకాని మద్దతు ధర

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు అదుపులేకుండా పెరుగుతూ ఉండటంతో రైతుల సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. 1963–70 సం॥ల మధ్య కాలంలో హెక్టారు పత్తిసాగుకి 3250 రూ.లు ఖర్చు చేస్తే, 2001–02లో ఎకరాకే 20వేలుకి చేరింది. ప్రస్తుతం ఆ ఖర్చు 40వేలకు చేరుకుంది. ప్రారంభంలో పురుగుమందులకు 11వందల రూ॥ ఖర్చుంది. కాగా, ఆ ఖర్చు నేడు 12వేలకు పైగా అవుతోంది. ఎకరాకి సగటు దిగుబడి 10 క్వింటాళ్ళు వస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈ దిగుబడి కూడా రాదు.

అధిక పెట్టుబడులు పెట్టి, అనేక ఇబ్బందులుపడి పంట పండిస్తున్న రైతులకు సరైన ధర లభించటంలేదు. గత సంవత్సరం క్వింటాలుకి ప్రకటించిన మద్దతుధర 3800రూ. ఇది గిట్టుబాటు కాదని, మద్దతు ధర పెంచాలని ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు ఈ ధరకు కూడా కొనుగోలు చేయలేదు. ప్రభుత్వరంగ సంస్థలు నామమాత్రంగానే కొనుగోలు చేసినా దానికి కూడా అనేక వంకలు పెట్టి ధరను తగ్గించారు. ఈ ధరతో రైతాంగానికి పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దిగుబడి 10 క్వింటాళ్ళు కూడా రాని రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గత సంవత్సరం వ్యవసాయ సీజన్ చివరిలో పత్తి ధర ఆశాజనకంగా ఉండటంతో, ఈ సీజన్‌లో పత్తిసాగు ఎక్కువ అవుతుందని ప్రచారం జరిగినా వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. గత సంవత్సరం 21.67లక్షల హెక్టార్లలో రైతాంగం పత్తి సాగుచేయగా, ఈ సీజన్‌లో 21.13 లక్షల హెక్టార్లలోనే పత్తిసాగు జరిగింది. ఇందుకు కారణం సోయాబీన్ లాంటి ఇతర పంటలకు రైతులు మళ్ళటమే. భారత పత్తివ్యాపార సంఘం (సీ.ఏ.ఐ) దేశంలో 3.73 లక్షల బేళ్ళ (ఒక బేలు 170 కేజీ) పత్తి ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేస్తున్నది. గత సీజన్‌లో ఉత్పత్తి 3.40 లక్షల బేళ్ళు. ఆంధ్ర రాష్ట్రంలో 70లక్షల బేళ్ళ ఉత్పత్తి జరుగుతుందని మొదట అంచనా వేసినా, భారీవర్షాలు, తుఫాన్ల వలన పత్తికి భారీనష్టం జరిగి ఉత్పత్తి గణనీయంగా తగ్గనున్నది.

ప్రస్తుత సీజన్‌లో పత్తికి కనీస మద్దతుధర 4500రూ. తక్కువ కాకుండా ఉండాలని రైతాంగం, రైతు–రైతుకూలీసంఘాలు, రైతు శ్రేయస్సు కోరే వారంతా డిమాండ్ చేసినా ప్రభుత్వం అందుకు అనుగుణంగా స్పందించలేదు. గతంలో కన్నా 100రూ. పెంచి 3900రూ॥గా మద్దతు ధర ప్రకటించడంతో రైతాంగం తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇది రాష్ట్ర రైతాంగానికి తీవ్రనష్టాన్ని తెచ్చిపెడుతుంది. వర్షాలకు పత్తికి నష్టం జరగటం వలన ఎకరాకి ఐదు క్వింటాళ్ళకు మించి దిగుబడి వచ్చే పరిస్థితిలేదు. దీన్ని గమనిస్తే రైతు పెట్టిన పెట్టుబడిలో సగం కూడా రాక, నష్టాలపాలై అప్పుల ఊబిలో మరింత కూరుకుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. పత్తి కొనుగోలుకు అనేక వంకలు పెట్టి ధరను తగ్గించేందుకు సి.సి.ఐతోపాటు వ్యాపార వర్గం పూనుకొంటుంది. గత అనుభవాలే ఇందుకు నిదర్శనం.

### మోన్‌శాంటో దోపిడీ

పత్తి విత్తన వ్యాపారంలో మోన్‌శాంటో గుత్తాధిపత్యం – దోపిడీ యధేచ్ఛగా కొనసాగుతున్నది. 80% పైగా బి.టి. పత్తి విత్తనాలే వినియోగంలో వున్నాయి. 2002 వరకు మన వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన “నరసింహ” హైబ్రీడ్ విత్తనాలతో ప్రపంచంలో మరే విత్తనాలు పోటీపడలేకపోయాయి. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, ప్రపంచ వ్యవసాయ ఒప్పందం ఫలితంగా బహుళజాతి సంస్థల విత్తన వ్యాపారానికి దేశ పాలకులు తలుపులు బార్లా తెరిచారు. అత్యంత దోపిడీదారీ, ప్రజాహంతక సంస్థ అయిన మోన్‌శాంటో – మహికో పత్తివిత్తనాల్లో బి.టి. ప్రవేశపెట్టి అధికదిగుబడులు వస్తాయని విస్తృతంగా ప్రచారం చేసింది. ఈ విత్తనాలు వచ్చిన తొలిదశలో రైతులచే సాగుచేయించటానికి ఎంత ప్రయత్నించినా, ఎన్ని ప్రలోభాలు పెట్టినా, వాటి సాగు నామమాత్రంగానే జరిగింది. దేశీయ విత్తనాలకే రైతాంగం ప్రాధాన్యమిచ్చింది. ఇలాంటి విత్తనాలు ఇంకా అభివృద్ధి చేసి, అధిక దిగుబడులు వచ్చే విధంగా మన శాస్త్రవేత్తలను ప్రోత్సహించాల్సిన పాలకులు, వాటి ఉత్పత్తినే అడ్డుకునే విధానాలు అమలుపర్చారు. ఈ విధంగా దేశీయ విత్తనాభివృద్ధిని అడ్డుకొన్నారు. పాలకులు సామ్రాజ్య వాదానికి, బహుళజాతి సంస్థలకు దాసోహమవటమే అందుకు కారణం. బి.టి. విత్తనాలను అనేక దేశాల్లో నిషేధించినా, దేశ ప్రయోజనాలను ఆకాంక్షించే శాస్త్రవేత్తలు వాటి విక్రయాన్ని అనుమతించరాదని కోరినా, దేశ ప్రయోజనాలను, రైతు ప్రయోజనాలను విస్మరించిన పాలకులు వాటి విక్రయాలకు అండగా నిలిచారు. పత్తి విత్తనాలతోపాటు, ఇతర పంటలకు చెందిన బి.టి. విత్తనాలకు అనుమతులు మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నారు. దేశీయ విత్తన ఉత్పత్తి కుంటుపరిచి, వ్యాపార సంస్కృతితో మోసపూరిత ప్రచారం చేయటంలో బహుళజాతి సంస్థలు ముఖ్యంగా మోన్‌శాంటో ఎంతో ముందుకు వెళ్ళింది. ప్రచార హోరుతో రైతాంగాన్ని భ్రమలకు గురిచేసింది. క్రమంగా బి.టి. విత్తన సాగుకి రైతాంగం నెట్టబడింది. ఫలితంగా దేశంలో వేలాది కోట్ల విత్తన వ్యాపారాన్ని మోన్‌శాంటో కొనసాగిస్తున్నది. ఈ సంవత్సరం రాష్ట్రంలో 12 వందల కోట్ల రూ॥ విత్తన వ్యాపారం జరిగినట్లు అధికారులు అంచనావేస్తున్నారు.

ప్రారంభంలో ఒక్కో బి.టి. పత్తి విత్తనాల ప్యాకెట్‌ను 1850రూ.కు విక్రయించారు. ఈ దారుణ దోపిడీకి వ్యతిరేకంగా ఆందోళన సాగటంతో బి.టి.1, 2 రకాల విత్తనాలకు 650, 750రూ.గా ప్రభుత్వం ధరను ఖాయపరిచింది. ధరను పెంచాలని మోన్‌శాంటో – మహికో చేసిన వత్తిడికి ప్రభుత్వం తలొగ్గి, ఈ సంవత్సరం బి.టి.2 విత్తన ప్యాకెట్ ధరను 930రూ.కు పెంచింది. ఇందులో విత్తన సేకరణకు 290 రూ॥గా, ఓవర్ హెడ్స్‌కు (ప్రాసెసింగ్, ట్రీట్‌మెంటు, ప్యాకింగ్, లేబుల్ బిల్లులు, పన్నులు, రవాణా ఛార్జీలు, డీలర్ కమీషన్, రిఫ్యూజ్ సీడ్స్) 550రూ.గా; మోన్‌శాంటోకి రాయల్టీ కింద 90రూ. గా పేర్కొంది. అంతర్జాతీయ పేటెంట్ చట్టాల ప్రకారం 10సంవత్సరాల వరకే రాయల్టీ చెల్లించాలి. దేశంలోకి బి.టి.విత్తనాలు వచ్చి 10 సం॥ దాటినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రాయల్టీని రద్దుచేసే చర్యలు తీసుకోలేదు. ఇది బహుళజాతి సంస్థల దోపిడీని ప్రోత్సహించటమే. ఫలితంగా ఈ సంవత్సరం రైతాంగం 120 కోట్ల రూ॥ను మోన్‌శాంటోకి సమర్పించుకోవాల్సి వస్తున్నది. ఓవర్‌హెడ్స్ కింద అన్నిరకాలుగా అయ్యే ఖర్చులను కలుపుకున్నా 200 లేక 250రూ. మించి ఉండదు. ప్రభుత్వం మాత్రం 550రూ.గా నిర్ణయించింది. దీన్ని గమనిస్తే విత్తన సంస్థలు ఏ స్థాయిలో లాభాలు పిండుకుంటున్నాయో అర్థమౌతుంది. ఇంత భారీస్థాయిలో లాభాలు వస్తున్నప్పటికీ విత్తన సంస్థల వ్యాపారానికి కీలకం వాటి ఉత్పత్తి. ఆ విత్తన ఉత్పత్తిని చేసే రైతులకు మాత్రం, విత్తన కంపెనీలు ఒప్పందం మేరకు కూడా డబ్బులు చెల్లించటం లేదు. 450 గ్రాముల ప్యాకెట్‌కి 290రూ. ఉత్పత్తి చేసిన రైతుకు చెల్లించాలి. అలా చెల్లించకుండా 750 గ్రాముల పాకెట్ ప్రాసెస్డ్ విత్తనాలకు 420రూ. మాత్రమే చెల్లిస్తున్నాయి. అయినా ప్రభుత్వం విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవటంలేదు.

అధిక రేటు పెట్టి విత్తనాలు కొన్నా అధిక దిగుబడులు కాని, ఖర్చులు తగ్గటం కాని, ఎరువుల వాడకంలో తగ్గుదల కాని, చీడల నివారణకాని జరగకపోగా ఎక్కువైనాయని, బి.టి.విత్తనాల కన్నా, దేశీయ విత్తనాల ద్వారానే దిగుబడులు అధికంగా వున్నాయని అనేక సర్వేలు వెల్లడించాయి.

### పత్తి ధరలను శాసిస్తున్న విదేశీ కంపెనీలు

పత్తి ధర పెరుగుదల, తరుగుదలలను అంతర్జాతీయ మార్కెట్‌లో బహుళజాతి కంపెనీలే నిర్ణయిస్తున్నాయి. ధరల నిర్ణయంలో వాటి దోపిడీ ప్రయోజనాలే ముఖ్యం. కొద్ది నెలల క్రితం వరకు 50వేల రూ॥ ఉన్న క్యాండీ పత్తి ధర 46వేల రూ॥కు పడిపోయింది. గత సంవత్సరం అమెరికా మండే మార్కెట్‌లో 83.29 సెంట్లు పలకగా, ముందస్తు మార్కెట్‌లో మే 13న 86.46 సెంట్లకు పెరిగింది. రైతుకు మండే మార్కెట్ ముఖ్యం. ముందస్తు మార్కెట్ బడా వ్యాపార వర్గానికి ముఖ్యం. ముందస్తు మార్కెట్‌లో ధరలను పెంచేది బడా వ్యాపారవర్గమే; లాభపడేదీ వారే.

భారతదేశంలో ఈ సంవత్సరం నవంబర్‌లో ఒకేసారి పత్తి మార్కెట్‌కి వచ్చే పరిస్థితి ఉంది. దీన్ని ఆసరా చేసుకొని దేశంలో ఉత్పత్తి పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధర తగ్గిందని పత్తిరేటుని నవంబర్‌కు ముందే వ్యూహాత్మకంగా తగ్గించారు. రూ. 3600 మించి ధర లభించలేదు. ప్రస్తుత సీజన్‌లో క్వింటాలు పత్తిని 3400రూ.కు రైతులు అమ్ముకోవాల్సి వస్తున్నది. పత్తి పూర్తిగా మార్కెట్‌కి వస్తే పరిస్థితి ఏమిటని రైతాంగం ఆందోళన చెందుతున్నది.

అమెరికా – తూర్పు యూరప్ దేశాలు వెనుకబడిన దేశాల మార్కెట్‌ని, వ్యవసాయాన్ని, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి ఆ దేశాలను ఉత్పత్తుల కోసం తమపై ఆధారపడేట్లు చేసుకొని ఆధిపత్యం చెలాయించే విధానాలను అనుసరిస్తున్నాయి. ఆయా దేశాల్లోని రైతులకు (భూకామందులు) పెద్దఎత్తున సబ్సిడీలు అందజేస్తున్నాయి. అమెరికాలో పండించే మొత్తం పత్తి విలువ 300కోట్ల డాలర్లు! వారికి అందుతున్న సబ్సిడీ 450 కోట్లు. ఇంత పెద్దఎత్తున లభిస్తున్న సబ్సిడీ వలన ఎంత తక్కువరేటుకి అమ్ముకొన్నా అక్కడి రైతులకు నష్టంలేదు. మన దేశంలో అందుకు విరుద్ధంగా రైతులకు అందే సబ్సిడీ నామమాత్రమే. దాన్ని కూడా క్రమంగా తగ్గించి వేస్తున్నారు. అందువలన ప్రపంచ మార్కెట్‌లో మన రైతులు పోటీపడలేకపోతున్నారు. ఫలితంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వెనుకబడిన దేశాలను దెబ్బ తీయటానికి మొదట చౌకగా అమ్మి, ఆ దేశాల్లో సంక్షోభం ఏర్పడి, ఉత్పత్తి తగ్గిన తర్వాత పత్తిరేటుని పెంచటం సామ్రాజ్యవాద దేశాల ఎత్తుగడ. దీని ఫలితమే అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల నిర్ణయం సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో బడా కంపెనీల ఇష్టానుసారం జరుగుతున్నది.

### పత్తి ఎగుమతులు – దిగుమతులు

భారతదేశం పత్తి దిగుమతుల్లో మిగులు దేశంగా పేర్కొనటం శోచనీయం. లక్షల, కోట్ల మంది ప్రజలు వంటినిండా బట్టలేక – అసలు బట్ట కరువై సిగ్గువిడిచి జీవిస్తున్నారు. వీరందరూ వస్త్రాలను ధరించగలిగితే దేశంలో పత్తి ఉత్పత్తి గణనీయంగా పెంచాల్సిన అవసరం ఏర్పడుతుంది. ప్రస్తుతం ఎగుమతుల స్థానంలో దిగుమతులు ఎక్కువగా ఉన్నాయి. ఇంతకు ముందు ప్రత్యేక రకాల పత్తిని మాత్రమే దిగుమతి చేసుకొంటే ఇప్పుడు సాధారణ రకాలను కూడా దిగుమతి చేసుకొంటున్నాము. కొద్ది సంవత్సరాల క్రితం వరకు విదేశాల నుండి 5–6లక్షల పత్తి బేళ్ళను మాత్రమే దిగుమతి చేసుకొంటే, ఈ సంవత్సరం 25లక్షల బేళ్ళ పత్తి దిగుమతి జరుగుతుందని పత్తి సలహా సంస్థ(సీఏఐ) అంచనాగా ఉంది.

అంతర్జాతీయ మార్కెట్‌కన్నా మన దేశంలో ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఎగుమతులు నిషేధించాలని ప్రభుత్వంపై వత్తిడిచేసే బడా వ్యాపారవర్గం, అంతర్జాతీయ మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తున్నప్పుడు దిగుమతులు ఎక్కువగా చేసుకోవాలని, అందుకు సుంకాన్ని తగ్గించాలని కోరటం తమ స్వార్థ ప్రయోజనాల కోసమే. వారు కోరిన విధంగానే ప్రభుత్వం దిగుమతులపై సుంకాన్ని తగ్గిస్తూ వస్తున్నది. గత సీజన్‌లో 129 లక్షల బేళ్ళదాకా ఎగుమతులు జరుగగా, ఈ సీజన్‌లో 81 లక్షల బేళ్ళ ఎగుమతి జరగవచ్చని సీఏఐ అంచనాగా ఉంది. ఎగుమతులు – దిగుమతుల వలన ఎటుచూసినా భారత రైతాంగమే నష్టపోతున్నారు. దిగుమతుల వలన మన పత్తి నిల్వలు పేరుకుపోయి మార్కెట్‌లో తక్కువధరకు అమ్ముకోవాల్సి వస్తున్నది. ఎగుమతులు, దిగుమతుల వలన దేశీయ – విదేశీ పెట్టుబడిదారులు బాగా లాభపడుతున్నారు. భారత రైతాంగం మాత్రం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఎగుమతి అయినా, దిగుమతైనా దేశ ప్రయోజనాలను, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేవిగా పాలకుల విధానాలు ఉండాలి. దేశంలో పత్తినిల్వలు పేరుకుపోతున్నప్పుడు దిగుమతులపై ఆంక్షలు విధించాలి. మన పాలకులు కానీ, బడా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల పరిరక్షణకే కంకణం కట్టుకొన్నారు.

ఇన్ని రకాల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పత్తి రైతాంగం, ఆ సమస్యల నుండి బయటపడాలంటే, భారత వ్యవసాయరంగంపై సామ్రాజ్యవాదుల ఆధిపత్యం తొలగాలని, బహుళజాతి సంస్థల విత్తన వ్యాపారాన్ని, బి.టి. విత్తనాలను నిషేదించాలని, అంతర్జాతీయ మార్కెట్‌తో సంబంధం లేకుండా దేశంలో పత్తికి న్యాయమైన ధర నిర్ణయించి కొనుగోలు చేయించాలని, సబ్సిడీలను పెద్దఎత్తున పెంచాలని, దిగుమతులపై సుంకం విధించాలని ప్రభుత్వంపై పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. ✡

# చే గువేరా, ఎన్ గుయెన్ జియాప్‌ల సంస్మరణ సభ

**మంగళగిరి, 9–10–13 :**

పిడిఎస్ఓ – ఎన్‌వైయస్ ఆధ్వర్యంలో స్థానిక సి.కె.జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సభకు పిడిఎస్ఓ జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె. నాగూర్, జె.బాజీలు అధ్యక్షత వహించారు. సభనుద్దేశించి పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. బాజీసైదా మాట్లాడుతూ చేగువేరా వర్ధంతి అయిన ఈ రోజున అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన ఇద్దరు వీరులను స్మరించుకోవాలని అన్నారు. ఒకరు అర్జెంటీనా దేశంలో పుట్టి క్యూబాదేశం వెళ్ళి అక్కడ ప్రజలు సాగిస్తున్న విముక్తి పోరాటంలో వీరోచిత పాత్ర పోషించి, క్యూబా విముక్తితో, ఆ దేశ పునర్నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించి, బొలీవియన్ పోరాటంలో దోపిడీ శక్తుల చేతుల్లో నేలకొరిగిన చేగువేరా; మరొకరు, వియత్నాం దేశంలో పుట్టి ఆ దేశాన్ని చుట్టుముట్టిన ఫ్రెంచ్ దురాక్రమణదారులకు, అమెరికన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఆ దేశ ప్రజానీకం 30–40 సం॥ల పాటు సాగించిన యుద్ధంలో సర్వ సైన్యాధ్యక్షుడిగా నిలిచి, వియత్నాం దేశ రక్షణ మంత్రిగా పనిచేసి 102 సం॥ల వయస్సులో 4–10–13న మరణించిన వియత్నాం వీరుడు ఎన్ గుయెన్ జియాప్‌లు. స్వేచ్ఛాప్రియులు, ప్రజలకు మిత్రులుగా జీవితాంతం ప్రజాశ్రేయస్సుకు అంకితమైన ఈ వీరులు నేటితరానికి ఆదర్శనీయులు అన్నారు.

ఎన్‌వైఎస్ నగర అధ్యక్షులు కా॥ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలని అనేక రూపాల్లో వివిధ దేశాల మీద (ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా) దాడులకు తెగబడుతూ, మనదేశంపై ఆర్థిక, రాజకీయ పెత్తనాన్ని సాగిస్తున్న అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, సామ్రాజ్యవాదుల చేతుల్లో కీలుబొమ్మలైన మన పాలకులు అన్ని రంగాలను ప్రైవేటీకరిస్తూ ప్రజల్ని కష్టాలపాలుచేస్తున్నారని, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలకు బలిచేస్తున్నారని, ఈ కుట్రలను అర్థం చేసుకొని విద్యార్థి యువతరం అందరికి విద్య, వైద్యం, ఉపాధి హక్కుగా సాధించుకొనేందుకు మనదేశ స్వేచ్ఛని, సౌభ్రాతృత్వాన్ని హరించివేస్తున్న అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశభక్తియుత పోరాటాలు సాగించాలని పిడిఎస్ఓ – ఎన్‌వైయస్ పిలుపు నిస్తున్నాయన్నారు. ✡


**విప్లవ ప్రజాఉద్యమం**

విప్లవ ప్రజాఉద్యమ సమస్యలు సావధానంగా చర్చిద్దాం!

**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**

**జనశక్తి ప్రచురణ** వెల: 10.00

# కరపత్రం

## చేనేత వృత్తిని రక్షించుకుందాం! జీవనోపాధిని నిలబెట్టుకుందాం!

# జీవన భద్రత-వేతనాల పెంపుదల-మెరుగైన జీవనంకోసం సంఘటితంగా ఉద్యమిద్దాం!

**చేనేత కార్మిక సోదరీ, సోదరులారా...!**

చేనేతరంగ సంక్షోభం మరింత తీవ్రమై పెను సంక్షోభంగా మారింది. ఈ వృత్తిపై ఆధారపడి జీవించే మనలాంటి లక్షలాదిమంది కార్మికుల జీవనం చిన్నాభిన్నమైపోతోంది. కుటుంబమంతా కలసి రోజంతా కట్టుబానిసల్లా, రెక్కలు ముక్కలు చేసుకున్నా, పట్టెడన్నం సంపాదించుకోవడమే గగనమైపోతోంది. ఆకలితో, పస్తులతో, రోగాలు, రొస్టులతో నిత్యం చస్తూ బ్రతుకుతున్నాము. ఎటుచూసినా సమస్యలూ, కష్టాలు, కడగళ్ళు, అప్పులు, అనారోగ్యాలు, ఆకలిచావులు, ఆత్మహత్యలూ... ఇదే నేటి చేనేతన్నల బ్రతుకు చిత్రం! ప్రతిరోజూ రాష్ట్రంలో ఏదో ఒకమూలన చేనేతన్నల ఆత్మహత్యల కథనం మన గుండె గాయాన్ని రేపుతూనే వుంది. కొన్ని వేలమంది కార్మికులు ఈ వృత్తిని వదిలి, ఇతర పనుల్లోకి సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారు. వారు అక్కడ దినసరి కూలీలుగా నికృష్టజీవనం సాగిస్తున్నారు.

**చేనేత దుస్థితికి, కార్మికుల దుర్గతికి కారకులెవరు?**

దేశంలోనే అతి పెద్ద స్వయం ఉపాధిరంగమైన 'చేనేత'ను పారిశ్రామికాభివృద్ధి, ఆధునికత, సాంకేతిక ప్రగతి, నూతన జౌళి విధానం, ప్రపంచమార్కెట్ పోటీ... పేరేదన్నా కానివ్వండి, పాలకులు చేపట్టిన విధానాలన్నింటి అంతిమ లక్ష్యం చేనేతను సమాధి చేయటమే! అందుకోసం నూలు ఉత్పత్తిని నిలిపివేయటం, ముడిసరుకులపై పన్నులు, సుంకాలు విధించి ధరలు పెంచటం, చేనేత రకాలను మిల్లులపై ఉత్పత్తి చేయించటం వంటి విధానాలను పాలకులు, ప్రభుత్వాధికారులే ప్రోత్సహించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగాన్ని గొంతులో చుక్కనీళ్ళు పోసి కాపాడటమేమో కానీ అత్యంత కిరాతకంగా వేటాడి చంపే మృగధర్మాన్నే చేపట్టారు. సంక్షోభపు సుడులలో క్రమంగా మునిగిపోయే 'చేనేత' బ్రతుకు నావను అమాంతం ఒక్కసారే ముంచేసే విధానంతో ముందుకు వచ్చారు.

**చేనేతకు చేటు తెచ్చే 'నిర్వచనం' మార్పు – రిబేటు పథకం రద్దు!**

'పత్తిని శుద్ధిచేయటం(జిన్నింగ్) మొదలు బట్ట తయారీ వరకూ ఏ దశలోనైనా చేతితో చేసే పని ఒక్కటి ఉంటే దానిని చేనేత బట్ట (ఉత్పత్తి)గా పరిగణించాలి' అని చేనేతకు నిర్వచనం మార్పు చేశారు. అంటే, దీని ప్రకారం ఆధునిక యంత్రాలు, ఏదో ఒక దశలో చేతిపని వుండేలా చూసుకుని మిల్లు బట్టలను దర్జాగా చేనేత బట్టగా అమ్ముకునేందుకు బడాబడా కంపెనీలకు అవకాశమిచ్చే రాజముద్రే ఈ కొత్త విధానం! చేనేతకు కల్పించిన రక్షణలు, కేటాయించే నామమాత్రపు నిధులూ, రాయితీలు, సబ్సిడీలు మొదలైనవన్నీ మిల్లు యజమానులకు మళ్ళించటమే దీని అంతరార్థం. అంతిమంగా 'చేనేత' అన్నది లేకుండా చేయటమే ఈ పథకం యొక్క లక్ష్యం.

కేంద్రప్రభుత్వం దాదాపు 6 దశాబ్దాలుగా సహకార రంగంలో చేనేత ఉత్పత్తులపై ఇచ్చే రిబేటు(సబ్సిడీ)ని రద్దుచేసింది. చరమదశలో ఉన్న సహకార రంగానికి ఊతకర్రగా ఉన్న రిబేటు పథకాన్ని రద్దుచేయటం సహకార రంగాన్ని, చేనేత రంగాన్ని సమూలంగా ధ్వంసం చేయాలన్న పాలకుల కుట్రలో భాగమే. మరోవైపు 'సాంకేతిక అభివృద్ధి నిధికి' (TUF) ఇబ్బడి ముబ్బడిగా పరిశ్రమలకు నిధులు తరలిస్తూ, సింగిల్ విండో పథకం ద్వారా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులన్నింటినీ ఒకేసారి, ఒకదగ్గరే ఇప్పించటం తద్వారా ఆధునిక పరిశ్రమల పోటీని కల్పించటం ఈ కుట్రలో లోతైన అంశం.

మిత్రులారా...! ఆధునిక యంత్రాల, మిల్లుయాజమాన్యాల, విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీల సేవలో, ప్రపంచమార్కెట్ జూదంలో, విదేశీ వస్త్రదిగుమతితో, స్వదేశీ చేనేతను బలిపెడుతున్న, చేనేత సంక్షోభాన్ని ఉధృతంచేసి మన జీవనాన్ని వీధులపాలు చేయబూనుకుంటున్న కేంద్ర, రాష్ట్ర దళారీ పాలకులకు, వారి విధానాలకు వ్యతిరేకంగా వృత్తి రక్షణకోసం, జీవనోపాధి కల్పనకోసం, జీవన భద్రతకోసం, వేతనాల పెంపుదల, జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ఈ క్రింది డిమాండ్ల సాధనకోసం సంఘటితమౌదాం! ఉద్యమిద్దాం!

**డిమాండ్స్ :**

- ❖ చేనేత వృత్తిపై ఆధారపడి జీవించే శ్రమజీవులందరికీ జీవనవేతనం నిర్ణయించి అమలుజరపాలి. 2013 ధరల ప్రకారం ఒక్కొక్క కార్మికునికి కనీసవేతనం నెలకు రూ॥ 10 వేలు ఆదాయం ఉండేలాగ వేతనాలు నిర్ణయించాలి.
- ❖ చేనేత ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగటం ఫలితంగా చేనేత ఉత్పత్తుల ధరలు పెరగటం, కేవలం 10–20 శాతం మందిగా ఉన్న ధనవంతులకే అందుబాటు కావటం ఫలితంగా మార్కెట్ కుదించుకుపోయింది. ముడి సరుకుల ధరల పెరుగుదల కార్మికుల వేతనాలపై తీవ్రప్రభావం చూపుతుంది. అందుకే నూలు, రంగులు, రసాయనాలు, చేనేతకవసరమైన ఇతర ముడి సరుకులన్నింటినీ పన్నులు లేకుండా, ఉత్పత్తి ధరలకే వృత్తిదారులకు అందించాలి. తద్వారా కార్మికుల వేతనాలు పెరిగేలాగా, బట్టలధరలు తగ్గి మార్కెట్ విస్తరించేలాగ చర్యలు చేపట్టాలి.
- ❖ ప్రభుత్వ రంగంలో పనిచేసే, ఉపాధిపొందే ప్రతిఒక్కరూ తమ కుటుంబ కట్టుబట్టల అవసరాలలో సగం చేనేత నుండి సేకరించి వాడుకునే విధంగా నియంత్రణ చేయాలి.
- ❖ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలోనూ చేనేత రంగానికి ప్రత్యేకించి నిధులు కేటాయించాలి.
- ❖ చేనేత రంగానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞాన(టెక్నాలజీ) సృష్టికి, అభివృద్ధికి భారత చేనేత రంగంపైనే ఆధారపడాలి. స్వదేశీ, స్వతంత్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిచేయాలి.
- ❖ మిల్లు ఉత్పత్తులను చేనేత ఉత్పత్తులుగా చలామణీ చేసే "చేనేత నిర్వచనాన్ని" కేంద్రప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలి.
- ❖ నేరుగా ఉత్పత్తిదారునికే అందేవిధంగా రద్దుచేసిన 'రిబేటు పథకాన్ని' పునరుద్ధరించాలి.

**ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం (ఆం.ప్ర.) AIFTU (న్యూ) అనుబంధం**

# చేనేత కార్మికులకు పరిహారానికై ధర్నా

**బందరు, 31-10-13 :**

చేనేత కార్మికుల ఆత్మహత్యలు నివారించాలని, చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలని, ఫైలిన్ తుఫాను, భారీవర్షాలకు గుంటల్లోకి నీళ్ళు వచ్చి, మగ్గాలు పాక్షికంగా దెబ్బతిని ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు ఆర్థికసహాయం, బియ్యం వగైరా అందించి ఆదుకోవాలని డిమాండు చేస్తూ 31-10-13న మచిలీపట్నం కలెక్టరు కార్యాలయం ఎదుట ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥యద్దనపూడి సోని ప్రసంగిస్తూ "ఫైలిన్ తుఫాను భారీవర్షాలకు మగ్గం గుంటల్లోకి నీళ్ళువచ్చి, మగ్గాలు పాక్షికంగా దెబ్బతిని ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. గత 3 సం॥ల కాలంలో కప్పలదొడ్డి, పోలవరంలలో 12 మంది చేనేత కార్మికులు, ఒక కౌలురైతు ఆత్మహత్య చేసుకొంటే ప్రభుత్వం స్పందించలేదు. ఇంతవరకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చేందుకు నిరాకరించటం దుర్మార్గం. సంపన్నుల, విదేశీ కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చే, చేనేత వ్యతిరేక విధానాలను అమలుచేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా, చేనేత కార్మికుల పరిరక్షణ కొరకు ప్రభుత్వం తగుచర్యలు చేపట్టేందుకు దీర్ఘకాలికపోరాటాన్ని ➔

➔ సాగించాలని కా॥ సోని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) బందరు ఏరియా అధ్యక్షుడు కా॥ముచ్చు సుధాకరరావు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కా॥పేరిశెట్టి విఘ్నేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥జి.మల్లేష్, చేనేత కార్మికుల ఆందోళనకు మద్దతు తెల్పిన రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥పామర్తి అంజమ్మ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అనంతరం కలెక్టరు కార్యాలయంలో అర్జీ ఇచ్చి చేనేత ఏడి ఆఫీసు వరకు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ధర్నాలో కప్పలదొడ్డి, పోలవరంకు చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు. ✶

# కమ్యూనిస్టు యోధుడు కా॥ ఘంటా సీతారామయ్య వర్ధంతిసభ

**రేపల్లె, 30-10-13 :**

గుంటూరుజిల్లా చెరుకుపల్లిమండలం – మండేవారిపాలెం గ్రామంలో 30-10-2013న కమ్యూనిస్టుయోధుడు కా॥ఘంటా సీతారామయ్య ప్రథమవర్ధంతి సభ నిర్వహించారు. ఎన్‌వైఎస్ నాయకులు కా॥ఎం.రాజేశ్వరి వక్తలను వేదికపైకి ఆహ్వానించగా సభకు సిపిఐ(ఎం-ఎల్) నాయకులు దొంతు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తొలుత సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి ముత్తిరెడ్డి శ్రీరాములు కా॥సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఉద్యమాలలో అమరులైన దొంతు నాగయ్య, తురిమెళ్ళ గోవిందయ్య, మండే పిచ్చయ్య, ఆ గ్రామంలో ఆనాడు పార్టీకి అండగా నిలిచి అమరులైన కామ్రేడ్స్ అందరికీ జోహార్లు చెపుతూ సభికులంతా 2 నిమిషాలు మౌనం పాటించారు.

సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి ఈ సభలో మాట్లాడుతూ సామాజిక అంతరాలను, అంతస్తులను గురించిన పరిశీలన జరుపుతూ కమ్యూనిస్టు శ్రేణులతో పరిచయాలలోకి వచ్చిన సీతారామయ్యగారు మార్క్సిస్టు దృష్టితో సమాజాన్ని విశ్లేషించుకొని సమాజ మార్పు అవసరమని నిర్దేశించుకొని, పీడిత, తాడిత, దళిత ప్రజల నడుమ తుదిక్షణం వరకు నడిచారన్నారు. గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషిచేసి, సాధించారని, నిర్వహణకమిటిలో వుండి దాని అభివృద్ధికి దోహదపడ్డారన్నారు.

పీడిత వర్గాల, దళితుల అభ్యున్నతిని కోరుకుంటూ సమాజంలో విప్లవాన్ని కోరుకుంటూ అలాంటి కృషిలో ఎదురౌతున్న పెత్తందారులకు, అగ్రకులతత్వాన్ని తలకెక్కించుకున్న శక్తుల దాడులకు, దౌర్జన్యాలకు ఎదురునిలిచారని, నేడు ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరలు తదితర అనేకసమస్యలు ప్రజలనడ్డివిరుస్తున్నాయని, ప్రజలందరికి అందవలసిన మౌలిక సౌకర్యాలు విద్య, వైద్యం ప్రజలకు అందడంలేదని, ఈ సమస్యల పరిష్కారం కొరకు ప్రజలందరు సంఘటితపడి ఉద్యమించాలని అదే సీతారామయ్యగారికి మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ఓపిడిఆర్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కా॥వి.హనుమంతరావు మాట్లాడుతూ కా॥సీతారామయ్యగారు సుదీర్ఘ రాజకీయ జీవితంగల కమ్యూనిస్టు విప్లవకారునిగా సమసమాజంకోసం సాగిన అన్ని ఉద్యమాలలో మడమ తిప్పకుండా నిలిచారన్నారు. సమాజానికి మొత్తంగా విజ్ఞానం అవసరమని భావించి కమ్యూనిస్టు ఉద్యమంతో పాటు గ్రంథాలయోద్యమంలో కూడా పాల్గొన్నారని, ఓపిడిఆర్ జిల్లా ఉపాధ్యక్షులుగా సుదీర్ఘకాలం సాగారని నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో గ్రామస్థులైన ముక్కంటి, బాబురావు, కోటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. గ్రామప్రజలు కా॥ఘంటా సీతారామయ్యకు ఘననివాళు లర్పించారు. ప్రజాకళాకారులు ప్రజాసమస్యలపై, ధరలపై, అమరవీరులపై పాటలు పాడి ప్రజలకు స్ఫూర్తినందించారు. ✶

# విప్లవ కార్మికోద్యమ నాయకుడు కా॥పిల్లలమర్రి సంస్మరణసభ



కా॥పిల్లలమర్రి చిత్రపటానికి పూలమాలవేస్తున్న కా॥మదార్; సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కా॥భార్గవశ్రీ

**విజయవాడ, 4-11-13 :**

విప్లవ కార్మికవర్గ రాజకీయాలను పుణికిపుచ్చుకొన్న కా॥పిల్లలమర్రి సంస్మరణసభ సిపిఐ(ఎం-ఎల్) విజయవాడ నగరకమిటీ నాయకత్వాన నవంబర్ 4వ తేదీన గుణదల విజయనగర్‌కాలనీలో జరిగింది. కా॥పిల్లలమర్రి చిత్రపటానికి ఆయన ఉద్యమ సహచరుడు కా॥షేక్ మదార్ పూలదండవేసి నివాళులర్పించారు. తర్వాత నగరపార్టీ సీనియర్ నాయకులు కా॥టి.పూర్ణచంద్రరావు, ధర్మారావు, అబ్రహాంలతోపాటు బంధువులు, మిత్రులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కా॥పిల్లలమర్రి స్మృతిలో సభికులు మౌనం పాటించారు.

సంస్మరణ సభకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా నాయకులు కా॥వీరబాబు, కా॥పిల్లలమర్రి జీవిత విశేషాలను వివరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ, శ్రామికవర్గ కుటుంబంలో పుట్టి ప్రైవేట్ బస్సుల మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించి, చదువురాకపోయినా కార్మికవర్గ రాజకీయాలను వంటబట్టించుకొని, శ్రామికవర్గ విముక్తి కోసం తన జీవితకాలం అలుపెరగని పోరాటం సాగించాడని, కమ్యూనిస్టుపార్టీలో తలెత్తిన మితవాద, అతివాద, అవకాశవాద రాజకీయ విధానాలపై రాజీలేకుండా పోరాటం సాగించి, కార్మికరంగంలో కూడా ఈ ధోరణులపై పోరాటం సాగించి విప్లవకార్మికోద్యమ వారసత్వాన్ని నిలిపారని, 1984లో విశాఖలో జరిగిన వర్కర్స్ సాలిడారిటీ మహాసభలో కార్మికవర్గ ఎర్రజెండా ఎగురవేసే గౌరవం పొందారని, అతివాద పోజుతో మొదట ప్రజాసంఘాలే అవసరంలేదన్నవారు తర్వాత ప్రజాసంఘాలు ఏర్పాటుచేసి విప్లవ ప్రజాసంఘాల అవగాహననే దెబ్బతీశారని ఆ కామ్రేడ్ తీవ్రంగా విమర్శించేవాడని, విప్లవ ప్రజాపంథాలో చివరికంటా కొనసాగి, విప్లవ కార్మికోద్యమ నిర్మాణంకోసం రాజీలేని పోరాటం సాగించిన కా॥పిల్లలమర్రికి విప్లవజోహార్లు తెలిపారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ఎం.ఎస్.శాయి కా॥పిల్లలమర్రితో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై కా॥పిల్లలమర్రితోపాటు కా॥మదార్ ఇద్దరూ జట్టుగా సంచిలో కరపత్రాలు వేసుకొని విస్తృత రాజకీయ ప్రచారకృషి సాగించేవారని, కార్మికవర్గ రాజకీయాలను చర్చిస్తూ అనేకమంది కార్యకర్తలను తయారుచేస్తూ వుండేవారని చెప్పారు.

ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కా॥కె.ఏసు మాట్లాడుతూ, మాచవరం, అరుల్‌నగర్, గిరిపురం ఇళ్ళస్థలాలకోసం సాగిన ఆందోళనల్లో కార్మిక సంఘ నాయకులుగా, మిలిటెంటుగా కా॥పిల్లలమర్రి పాల్గొన్నారని, ఎమర్జెన్సీ నిర్బంధకాలంలో ఆయన, ఆయన కుటుంబం పార్టీకి అన్నివిధాల సహకరించేవారని చెప్పారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శి కా॥వై.సోనీ మాట్లాడుతూ, నేడు అన్నిరంగాల్లోకి ప్రైవేటీకరణ విధానాలు చొచ్చుకువస్తున్న నేపథ్యంలో గతంలో సాధించుకొన్న కార్మికుల హక్కులను నేడు తిరిగి సాధించుకోవాల్సిన స్థితిలో విప్లవ కార్మికోద్యమ నిర్మాణం కోసం కృషిచేసే అనేకమంది 'పిల్లలమర్రులు' నేడు కావాలన్నారు.

ఇంకా ఈ సభలో జనవిజ్ఞానవేదిక నాయకులు ఎఎస్ఎస్ రామ్‌ప్రసాద్, స్థానిక కాలనీవాసులు దేవరాజు, తమకు కా॥పిల్లలమర్రితో గల ఉద్యమ అనుభవాలను వివరించారు. ✶

# హెలెన్ తుఫాను బాధితులకు తక్షణమే సహాయక చర్యలు అందించాలి

**ఫై-లిన్** తుఫాన్, భారీ వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సం, నష్టాన్ని రాష్ట్రప్రజలు మర్చిపోకముందే మరోసారి "హెలెన్" రూపంలో తుఫాన్ విరుచుకుపడింది. ఈ తుఫాన్ పంజాకు గుంటూరు, క్రిష్ణా, ఉభయ గోదావరులు, శ్రీకాకుళం జిల్లాలు తీవ్రనష్టానికి గురైనాయి. 11మంది ప్రాణాలు కోల్పోయారు. 15 లక్షల ఎకరాల్లో వరి, కొబ్బరిచెట్లు, అరటి, మినుము, కూరగాయలు మొదలైన పంటలు నష్టపోయాయి. తమ కళ్ళముందే కోసిన వరిపనలు, కోయబోయేపంట నీటిలో తేలియాడుతుంటే, అరటి-కొబ్బరి చెట్లు నేలకూలుతుంటే రైతుల గుండెలు అవిసిపోయాయి. పేదలు తలదాచుకొనే వందలాది ఇండ్లు నేలకూలాయి. మత్స్యకారులు రోజులతరబడి ఉపాధి కోల్పోయారు. సముద్రంలో చిక్కుకున్నవారు ప్రాణరక్షణకు తుఫాన్‌తో పోరాడారు. చేనేత కార్మికులకు నష్టం వాటిల్లింది. కరెంటు స్థంభాలు, చెట్లు పెనుగాలికి వేలాదిగా కూలిపోయాయి. వందలాది గ్రామాలు అంధకారంలో మునిగాయి. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందనే భయంతో ప్రజలు భయాందోళనలకు గురైనారు.

తుఫాన్ ప్రమాదాన్ని ప్రజలు అర్థంచేసుకోవటంతో ప్రాణనష్టం తక్కువగా జరిగింది. ముంపు నివారించే చర్యలు దీర్ఘకాలంగా పాలకులు చేపట్టకపోవటంవలన ఈ తుఫాన్‌కి అపారనష్టం జరిగింది. కోలుకోలేని విధంగా రైతాంగం నష్టపోయారు. కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇళ్లు కూలి పేదలకు నిలువనీడలేకుండా పోయింది. తుఫాన్ తీరం దాటిన తర్వాత కురిసిన భారీవర్షాలకు పంటనష్టం ఎక్కువ జరిగింది. మురుగు రూపంలో నష్టం ఇంకా పొంచే వుంది. (నెలాఖరుకు మరో పెనుతుఫాను పొంచివుందనే వార్తలు మరింత కలవరపరుస్తున్నాయి) సుదీర్ఘ సముద్రతీరం తూర్పుకోస్తా రాష్ట్రాలకు వరంతోపాటు శాపంగా కూడా వుంది. చిన్న, పెద్ద తేడాలేకుండా నిత్యం తుఫాన్‌ల తాకిడిలకు గురౌతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను నివారించటం సాధ్యంకానప్పటికీ వాటి నష్టాలను తగ్గించవచ్చు. తుఫాన్ గాలుల ఉధృతిని, అలలను అడ్డుకొనే మడ అడవులను, సర్విచెట్లను, ఇసుకదిబ్బలను పరిరక్షించటానికి బదులు అభివృద్ధిపేరుతో పాలకులు నాశనం చేస్తున్నారు. దీనివలన తుఫాన్ ఉధృతి పెరగుతున్నది.

భారీ వర్షాలు, వరదలు, తుఫాన్‌లవలన లభించే నీటిని నిల్వచేసే ప్రాజెక్టులను పాలకులు పూర్తిచేయలేదు. చెరువులకు మరమ్మత్తులుచేసి నీటిని నిల్వచేయటంలోనూ విఫలమైనారు. పంట-మురుగుకాల్వలకు మరమ్మత్తులు జరిపి ముంపునీటిని త్వరగా పంపే ఏర్పాట్లు చేయలేదు. కరకట్టలను పటిష్టపర్చకపోవటంవలన తెగి ముంపును సృష్టిస్తున్నాయి. వీటిని చేపట్టి ఉంటే సాగు-త్రాగు నీరుతోపాటు, ముంపు నష్టాలు తగ్గేవి. పాలకులకు అలాంటి విధానాలు లేవు.

ప్రకృతి వైపరీత్యాలు, నష్టాలు జరిగినప్పుడల్లా రైతులను, ప్రజలను అన్నివిధాల ఆదుకొంటామని పాలకులు చెప్పటంతప్ప ఆచరణలో అమలుచేయటంలేదు. లైలా తుఫాన్ సహాయమే ఇంతవరకు రైతులకు అందలేదు. ఫైలిన్ తుఫాన్ నష్టాల అంచనాను నిర్ధారించలేదు. కేంద్రబృందం వచ్చిందీ, వెళ్లింది. ఇప్పుడూ ప్రభుత్వం అవే మాటలు చెబుతున్నది. సహాయం అందించటంలో పాలకుల విధానం మారాలి. నష్టపోయిన ప్రజలు సహాయంపొందటం వారి హక్కుగా గుర్తెరగాలి. ప్రభుత్వం వెంటనే ఈ క్రింది సహాయక చర్యలు చేపట్టాలి.

- పంట నష్టపోయిన రైతాంగానికి పూర్తి (పంటవిలువ మొత్తం) నష్టపరిహారం చెల్లించాలి.
- రైతులకున్న అన్నిరకాల అప్పులను రద్దుచేయాలి. తిరిగి రుణం మంజూరు చేయాలి.
- దాళ్వాసాగుకి, జొన్న, మొక్కజొన్న పంటలకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలి.
- తడిసి, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వ సంస్థల ద్వారా వెంటనే కొనుగోలు చేయించాలి.
- మృతుల కుటుంబాలకు 10 లక్షల పరిహారం చెల్లించాలి.
- ఇళ్లు కోల్పోయిన వారికి యుద్ధప్రాతిపదికపై పక్కాఇళ్ళు పటిష్టంగా నిర్మించాలి.
- పేదలకు 50 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యజీవితావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలి. కుటుంబానికి 10వేల చొప్పున ఉచిత సహాయం అందించాలి. ఉపాధి పనులు కల్పించాలి.
- పంట-మురుగుకాల్వలు, చెరువులకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి. కరకట్టలను పటిష్టపర్చాలి.
- మడ అడవులను, సర్విచెట్లను, ఇసుకదిబ్బలను రక్షించి, అభివృద్ధిచేయాలి.
- నీరు సముద్రం పాలుకాకుండా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలి.
- చేనేత కార్మికులకు, ఉప్పురైతులకు తగినవిధంగా పరిహారం చెల్లించాలి.
- మత్స్యకారుల పడవలకు నష్టపరిహారంతోపాటు, నెలరోజులకు సరిపడ గ్రాసం ఇవ్వాలి.
- విరిగిన, నష్టపోయిన కొబ్బరి చెట్లకు రూ॥10, 5 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి.

విజయవాడ
24-11-13

యస్.ఝాన్సి
రాష్ట్ర అధ్యక్షులు
రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

కొప్పుల కోటయ్య
రాష్ట్ర కార్యదర్శి
రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

# 'వర్గ ఉద్యమాలలోకి పీడితులను సమీకరించాలి'

## గుంటూరు జిల్లా యువజన సదస్సులో ఎన్‌వైఎస్ కార్యదర్శి కా॥ బాషా పిలుపు



సదస్సుకు హాజరైన యువజనులు; ప్రసంగిస్తున్న కా॥బాషా

**పిడుగురాళ్ళ, 17-11-13 :**

గుంటూరుజిల్లా ఎన్‌వైయస్ ఆధ్వర్యంలో 'నేడు దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, పాలకవర్గ నేతృత్వంలో పతనమవుతున్న విలువలు - యువతరం చేపట్టాల్సిన ఆదర్శాలు, కర్తవ్యాలు' అంశాలపై యువజన సదస్సు స్థానిక లెనిన్‌నగర్‌లో 17-11-13న జరిగింది. తొలుత, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి సదస్సుకు హాజరైన యువజనులు స్థానిక రైల్వేస్టేషన్ నుండి ఏడుకొట్ల సెంటర్, పోలీస్‌స్టేషన్‌ల మీదుగా ప్రదర్శనగా లెనిన్‌నగర్‌లోని సదస్సు ప్రాంగణానికి చేరుకున్నారు.

ఈ సదస్సుకు అధ్యక్షవర్గంగా ఎన్‌వైఎస్‌నాయకులు కామ్రేడ్స్ పి.మల్లి, రాజేశ్వరి, దుర్గ, వెంకన్న, ప్రకాష్‌లు వ్యవహరించారు. ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ఎస్‌కె భాషా ఈ సదస్సులో ప్రధానోపన్యాసం చేస్తూ భారతదేశంలోని మొత్తం జనాభాలో అత్యధికులుగానున్న కష్టజీవుల, పేదల పరిస్థితి నేటి పాలకవర్గాల దోపిడీ విధానాల వలన నిత్యం ఆందోళనభరితంగా మారిందన్నారు. "ప్రజల మధ్యన ఆర్థిక, సామాజిక, సాంఘిక అంతరాలు నానాటికి తీవ్రం చేయబడుతున్నాయి. దేశంలోని ప్రజలందరి అవసరాలుకు వినియోగించబడాల్సిన సహజసంపదలు, వనరులు దేశం బయటికి తరలించబడుతూ, అతి కొద్దిమంది దోపిడీశక్తుల చేతుల్లో కేంద్రీకరించబడి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మౌలిక ఉత్పాదకరంగాల అభివృద్ధి కుంటుపడి, దీనిపై ఆధారపడిన ప్రజల జీవనం నిత్యం ఆందోళనా భరితమైంది.

ప్రధానంగా వ్యవసాయదారునికి భూమి దూరం చేయబడింది. కౌలురైతులు, రైతుకూలీలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల పాల్పడుతున్నారు. ప్రైవేటీకరణ విధానాలతో ప్రభుత్వ పారిశ్రామిక ప్రగతి దిగజారిపోతున్నది, ప్రభుత్వ సంస్థలు మూసివేతకు గురిఅవుతున్నాయి. కార్మికులు రోడ్లపైకి నెట్టివేయబడుతున్నారు. ఉపాధి - ఉద్యోగ సమస్యతో యువత భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. విద్యా, వైద్యరంగాలు వ్యాపారంగా మారాయి. మహిళలపై విద్యార్థినులపై, బాలికలపై అత్యాచారాల, హత్యల పరంపర కొనసాగుతున్నది. మద్యం, మత్తు పదార్థాల వ్యాపారం జోరుగా సాగుతూ రాష్ట్రాదాయంలో సగం స్థానాన్ని భర్తీచేస్తున్నది. నిమ్నకులాల ప్రజలపై కులదురహంకార దాడులు, హత్యలు పేట్రేగిపోతున్నాయి. ప్రాంతీయ వైషమ్యాలను, ప్రజల మధ్యన అంతరాలను, అసమానతలను పెంచుతున్నారు. ఇన్ని రకాల సామాజిక సమస్యలకు, రుగ్మతలకు కారకులుగా నిలిచి, వాటిని అనుమతించి, ప్రోత్సహించి, నిర్వహిస్తున్నది భారత పాలకవర్గాలే. ఈ ప్రజావ్యతిరేక విధానాల వలన మెజారిటీగా ఉన్న కష్టజీవుల, పీడితుల, దళిత ప్రజల పరిస్థితి నానాటికీ దిగజారిపోతూ, ధ్వంసం చేయబడుతోంది. ఈ సంక్షుభిత పరిస్థితులలో యువతరం సమాజంలో చెడులకు వ్యతిరేకంగా పేద, మధ్యతరగతి, పీడిత ప్రజలని పాలకవర్గాల దోపిడీశక్తులకు వ్యతిరేకంగా నిలబెట్టటం కోసం ప్రగతిశీల ఆలోచనలతో చైతన్యయుతం చేసి భగత్‌సింగ్ కలలుగన్న దోపిడీరహిత సమాజాన్ని నిర్మించే వర్గపోరాటాలలోకి సమీకరించాలి. నూతన ప్రజాస్వామిక విప్లవంలక్ష్యం కలిగివున్న ఎన్‌వైఎస్ యువజనోద్యమంలోకి యువతరం సమీకృతం కావాలని, నేటి సామాజిక రాజకీయ, ఆర్థిక సంక్షుభిత పరిస్థితులకు కారకులైన పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కా॥ బాషా పిలుపునిచ్చారు.

ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కా॥విజయసారధి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకీ పెరుగుతున్న అసమానతలు వాటికి కారణాలైన పాలకవర్గాల విధానాలపై యువతరం పోరాటం సాగించాలన్నారు. ప్రగతిశీల, ప్రజాతంత్ర భావాలవైపు యువత ఆలోచనలు మరలాలని, దీనికి విద్యావ్యవస్థ ప్రధాన వారధిగా నిలవాలన్నారు. 'శాస్త్రీయ, స్వతంత్ర, ప్రజాతంత్ర విద్యావిధానం' ప్రస్తుతవిద్యావిధానానికి ప్రత్యామ్నాయంగా ఉండాలని, ఈ మార్పులకోసం యువత ప్రధానంగా కృషిచేయాలని తన ఉపన్యాసంలో కోరారు.

ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు కా॥ ఎమ్.వి.కృష్ణయ్య మాట్లాడుతూ భారతపాలకులు ప్రపంచబ్యాంక్ ఆదేశిత ఆర్థిక విధానాలను అమలుపర్చున్న ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయివిలువ పతనమవుతున్నదని, సాధారణ ప్రజల జీవనం నేడు పెనుభారంగా మారిందని, నిత్యం ధరల పెరుగుదల వలన పేద, మధ్యతరగతి ప్రజలు కష్టాలనెదుర్కొంటున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా చైతన్యయుతమైన ఆలోచనలతో, ప్రగతిశీల భావాలతో, గ్రామసీమల నుండి పట్టణ ప్రాంత పీడితుల, కష్టజీవుల మధ్యన నిలబడి పాలకవర్గాల దోపిడీని ఎదిరించి, ప్రజల్ని నిలబెట్టే బాధ్యత నేటి యువతరం భుజానికెత్తుకోవాలని కా॥ కృష్ణయ్య కోరారు.

ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ వి.హనుమంతరావు మాట్లాడుతూ 'భారత ప్రజాస్వామ్య పాలన' 6 దశాబ్దాలపైగా కాలం సాగినా హక్కులు, న్యాయం, చట్టాలు అనేవి పాలకవర్గాల, సంపన్నుల అజమాయిషీలోనే నడుస్తున్నాయనీ, భారత ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్య భారతాన్ని నిర్మించాలంటే నేటి యువతరం సర్దార్ భగత్‌సింగ్, అల్లూరి రామరాజుల పోరాటస్ఫూర్తిని స్వీకరించి యువజనోద్యమాలను ముందుకు తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు.

ఇంకా ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శులు ఎస్‌కె బాజిసైదా, కె.వి.రమణలు ప్రసంగించారు. అనంతరం కా॥ కె.శ్రీను అధ్యక్షులుగా, కా॥ కె.లక్ష్మణ్ కార్యదర్శిగా మరో ఆరుగురు సభ్యులతో ఎన్‌వైఎస్ గుంటూరుజిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం పలు ప్రజాసమస్యలపై సదస్సు తీర్మానాలను ఆమోదించింది. జిల్లా యువజన సదస్సు సన్నాహక కృషిలో భాగంగా గుంటూరు జిల్లాలో- పిడుగురాళ్ళ, రెంటచింతల, కారంపూడి, గుంటూరు, రేపల్లె, మంగళగిరి ప్రాంతాలలో ఆయా ప్రాంతాల స్థానిక యువజనసంఘ కమిటీల సమావేశాలను, గ్రామాలలోనూ, పట్టణాలలోనూ యువజనులతో సమావేశాలను నిర్వహించి సదస్సును విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ✡

# సాగునీటి సమస్య పరిష్కారానికై రైతాంగ ఆందోళన


నల్గొండజిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

**గుర్రంపోడ్, 18-11-13 :**

నల్గొండజిల్లా గుర్రంపోడ్ మండలంలో SLBC, AMRP ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలు 16-17 ఆయకట్టు క్రింద 2400 ఎకరాలు తుంపరసేద్యానికి ఎంపిక చేశారు. పల్లెపహాడ్, తేరటిగూడెం, మొసంగి, మెరడ్లగూడెం గ్రామాలు పి.ఏ.పల్లి మండలపరిధిలో గనిపల్లి, బీమనపల్లి గ్రామాలు పెద్దవూర మండలంలోని వెల్మగూడెం గ్రామాల రైతుల భూములలో (ప్రభుత్వ జి.వో.నెం.194, తేది 31-08-2007 ప్రకారం) 19.56 కోట్లు విడుదలచేసి జైన్ కంపెనీకి రైతుల భూముల్లో సంపులు (బావులు) త్రవ్వి మేజరు కాల్వలనుండి పైపులైన్ వేసి విద్యుత్ లైన్‌వేసి మోటర్లు బిగించి రైతులకు అప్పగించటానికి నిర్ణయించింది.

ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం కింద బావులు త్రవ్వి, పైపులైనువేశారు. పైపులలో చెత్త, రాళ్లు అడ్డు పడినందువలన లెవల్‌గా వేయకపోవడంవలన నీళ్లు బావులకు పోవడంలేదు.

విద్యుత్ లైన్ వేశారు. కానీ, రైతులకు ఇంతవరకు మోటార్లు ఇవ్వలేదు. ఇచ్చినా బావులకు నీళ్లు రావడం లేదు. విద్యుత్‌లైన్ నుండి ఎల్.టి.లైన్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొంతమందికి మొదట ఇచ్చిన మోటార్లు, స్టార్టర్లు దొంగలు ఎత్తుకెళ్లినారు. గత 5 సంవత్సరములనుండి రైతులు కాల్వలు లేనందువలన వ్యవసాయభూములలో వేసిన మెట్ట పంటలకు నీరు పెట్టుకోలేదు. ప్రభుత్వ అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా 19.56 కోట్లు వృధా కాగా, పంటలకు నీరులేక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

1. జి.ఓ.నెం.34 రద్దుచేసి కాల్వల ద్వారా రైతుల వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలి. 16,17 డిస్ట్రిబ్యూటరీలనుండి 18 నుండి 25 డిస్ట్రిబ్యూటరీలు మేజరు కాల్వలనుండి వ్యవసాయ భూములకు పిల్ల కాల్వలు త్రవ్వించాలి.
2. చెర్వులకు కాల్వలు లేక ప్రతి సంవత్సరం నీళ్లు వదిలినప్పుడు చెర్వులు నిండాలంటే రైతుల వ్యవసాయ భూములు కొట్టుకపోతున్నవి. కావున చెర్వులకు ప్రత్యేకంగా కాల్వలు త్రవ్వించాలి.
3. చేపూరు పెద్దచెరువు మంచినీటి ప్రాజెక్టు 2009లో ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత ఫిల్టర్ నీళ్లు అందించాలి. కాంట్రాక్టర్ల, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు ఏ గ్రామానికీ మంచినీరు రావడంలేదు. ప్రతి వేసవి కాలం మంచినీరు దొరకని గ్రామాలు చాలా ➔

➔ వున్నవి. 4 నెలల్లో వేసవి రాబోతున్నది. 2013 మార్చిలో మంచినీరు అందిస్తామని, వారానికి ఒకసారి మురికి నీరు అందించారు. ఫ్లోరిన్ నీళ్ళవలన ప్రజలకు కిడ్నీ, కీళ్ల సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుమునొప్పులు, రకరకాల వ్యాధులు వస్తున్నాయి. ఫిల్టరు నీళ్లు ప్రజలు కొనుక్కొని త్రాగుతున్నారు. నెలకు 200 నుండి 300 రూపాయల వరకు ఖర్చు పెడుతున్నారు.

4. SLBC,AMRP ప్రాజెక్టుపై భాగము 7-బి డిస్ట్రిబ్యూటరీ నుండి హైలెవల్ కెనాల్ జూనూతల నుండి తేనేపల్లి హనుమాన్ చెర్వునుండి పోచంపల్లి చెర్వు వరకు పొడిగించాలి.
5. జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన చెర్వులు, కుంటలు, కాల్వలకు వెంటనే నిధులు మంజూరుచేసి వేసవి రాకముందే నెలరోజుల్లో పనులు పూర్తిచేయాలి.

పై డిమాండ్లు పరిష్కరించాలని 18-11-13న నల్గొండజిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రైతులు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో ధర్నాచేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యదర్శి కా॥కొప్పుల కోటయ్య పాల్గొని ఆందోళన ద్వారా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా సంఘం నల్గొండజిల్లా నాయకులు కామ్రేడ్స్ జక్కుల నర్సింహ, బండారు యాలాద్రి, జయరాజు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, పెదవీరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నాయకత్వం వహించారు. ✡

## ‘మౌలిక సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించే పాలకుల విధానాలపై పోరాడుదాం’ సిపిఐ (ఎం-ఎల్) ప్రచారం

**రాష్ట్రంలో** – సమైక్య మరియు ప్రత్యేక రాష్ట్రాల వాదనలతో దోపిడీ పాలకవర్గ శక్తులు యిరు ప్రాంత ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి ప్రజలను సమిధలను చేస్తున్నాయి. పాలకవర్గాల ఈ కుట్రలను వెల్లడిచేస్తూ, ప్రస్తుత పరిస్థితిలో ప్రజలముందున్న కర్తవ్యాలను తెలియచేస్తూ బూర్జువా, భూస్వామ్య పాలక వర్గాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలనే సిపిఐ (ఎమ్ఎల్) అవగాహనను, కార్యక్రమాన్ని వివరిస్తూ గుంటూరుజిల్లా రెంటచింతల మండలంలోని పలు గ్రామాలలో పార్టీ కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు.

22-8-13 నుండి 26-8-13 వరకు జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో–రెంటచింతల మండలంలోని పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం, పాలువాయి, పాలువాయిగేటు, తుమ్మకోట, కొత్తగంగరాజుపల్లి గ్రామాలలో రాష్ట్రకమిటి ప్రచురించిన కరపత్రాలను పంపిణీచేస్తూ గ్రూపు సమావేశాలు నిర్వహించారు. పార్టీసభ్యులు, సానుభూతిపరులు 10–25మంది వరకు ఆయా గ్రామాలలో క్యాంపైన్‌లో పాల్గొన్నారు. కరపత్రాలను ప్రజలు శ్రద్ధగా చదవడంతోపాటు, పాలకుల ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆందోళనల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, నిత్యావసర సరుకుల ధరలన్నీ పెరిగి చచ్చిపోతున్నామని, రవాణా ఛార్జీలు తడిసి మోపెడవుతున్నాయని, పాలక రాజకీయ పార్టీలన్నీ ఊసరవెల్లులేనని అధికారపీఠాన్ని ఎవరు ఎక్కినా, ఎవరు దిగినా, రాష్ట్రం విడిపోయినా, కలిసి ఉన్నా తమ జీవితాలలో మార్పేమీ రాదని, తమకు ఈ చాకిరీ తప్పదని పెరుగుతున్న ఎరువులరేట్లు, పురుగుమందుల రేట్లు, విత్తనాల ధరలు తగ్గించేవాడే లేడని, తమ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే పార్టీయేలేదని, వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరుగుతూ, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక అప్పులపాలవుతున్నా, కిడ్నీలు అమ్ముకుంటున్నా ఆదుకునే నాధుడే లేడని – రైతులు, గ్రామీణ కూలీలు, చేతివృత్తుల ప్రజలు వారి స్పందనలను వ్యక్తం చేశారు.

రెంటచింతల, గురజాల, దుర్గి, మాచర్ల, మంచికల్లు మండల కేంద్రాలతోసహా పలుగ్రామాలలో క్యాంపైన్ చేశారు. ప్రజల ఏ ఒక్క సమస్యను పరిష్కరించని దోపిడీ పాలకవర్గ శక్తులు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం, తమ దోపిడీని సుస్థిరం చేసుకోవడం కోసం కుల, మత, ప్రాంతీయతత్వాలను రగిల్చి, రెచ్చగొట్టి ప్రజలను పెనంమీద నుండి పొయ్యిలోకి పడద్రోసే విధానాలను అమలుచేస్తున్న పాలకవర్గాల ఉచ్చులో పడకుండా ప్రజలు జాగరూకతతో వ్యవహరించాలని – ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలైన కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం, భూమి తదితర సమస్యలపై ప్రజలందరు కలిసి ఐక్యంగా ఉద్యమించాలని, పంటల గిట్టుబాటు ధరలకోసం, వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ఆధిపత్యం, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ క్యాంపైన్ సందర్భంగా పిలుపునిచ్చారు. ✡

## ప్రాంతీయ విద్వేషాలను పెంచే పాలకుల కుటిలత్వాన్ని వెల్లడిచేస్తూ గుంటూరుజిల్లాలో పిడిఎస్ఓ-ఎన్‌వైఎస్ క్యాంపెయిన్

**పాలక** రాజకీయ నాయకులెవ్వరూ, ఏనాడూ రాష్ట్రంలో సమగ్ర, సమతుల్యమైన అభివృద్ధికి తోడ్పడలేదు. ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటులోగానీ, సమైక్యరాష్ట్రంలోగానీ, ప్రజలెదుర్కొంటున్న ఏ ఒక్క సమస్య పరిష్కరించబడలేదు. మౌలిక పరిష్కారం నుండి ప్రజల దృష్టి మళ్ళించి, ఎవరి ఆధిపత్యంలో రాజకీయ అధికారం ఉండాలన్న తగవును పరిష్కరించుకునేందుకు పాలకవర్గాలలోని ముఠాలు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఈ సందర్భంగా తెలుగు మాట్లాడే ప్రజలందరి మధ్య, తెలుగు భాషను అనుసరించే కష్టజీవులందరి మధ్య సౌహార్ధపూరిత వాతావరణం నెలకొల్పుకోవడం కోసం, సమగ్ర అభివృద్ధి కోసం, సామాజికమార్పు కోసం తెలుగునాట వున్న అన్ని ప్రాంతాల కార్మిక, కర్షక బడుగు బలహీనవర్గాలు, ప్రజాతంత్రశక్తులు విద్యార్థి, యువజనులు కలిసిమెలిసి పోరాడటం, భుజంభుజం కలిపి నడవటం తక్షణావసరంగా ఎంచి పిడిఎస్ఓ–ఎన్‌వైఎస్‌ల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లావ్యాప్తంగా విస్తృత క్యాంపెయిన్ చేపట్టారు. గుంటూరు, మంగళగిరి, రేపల్లె, పిడుగురాళ్ళ, రెంటచింతల, గురజాల మండలాలలోని పలుగ్రామాలలో 35,000 కరపత్రాలను విద్యార్థులు, యువకులు, ప్రజాతంత్రవాదుల మధ్య పంపిణీ చేశారు.

### గుంటూరు

గుంటూరులోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలోను, టిజెపిఎస్, హిందూ, రామాకామర్స్, గురవయ్య కాలేజీ, ఉమెన్స్ డిగ్రీకాలేజీల విద్యార్థులు, లెక్చరర్స్ నడుమ క్యాంపెయిన్ సాగించారు. గుంటూరు నగరంలోని పల్నాడు బస్టాండ్‌లో; లక్ష్మీపురం నుండి బృందావన గార్డెన్స్, మార్కెట్ నుండి బస్టాండ్, నాజ్ సెంటర్ నుండి కొత్తపేటమీదగా బస్టాండ్ వరకు, లాడ్జి సెంటర్ నుండి శంకర్ విలాస్ వరకు వీధి ప్రచారంగా 20మంది విద్యార్థి యువకులతో 5 రోజులపాటు ఈ ప్రచారకృషి సాగించారు. ఈ ప్రచారంలో – ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి;ప్రభుత్వ ఆధ్వర్యంలో పారిశ్రామిక అభివృద్ధికి; వ్యవసాయరంగ అభివృద్ధికి; మంచినీరు, సాగునీటి కల్పనలకోసం పోరాడుదామని; ప్రాంతీయ వైషమ్యాలకు, విద్యావైద్యరంగాల ప్రైవేటీకరణకు, ప్రభుత్వ పరిశ్రమల మూసివేతకు, కార్మికుల గెంటివేతకు, సహజసంపదల ప్రైవేటీకరణకు, రాజకీయ నాయకుల, దళారుల కుంభకోణాలకు వ్యతిరేకంగా పోరాడుదామని నినదించారు. ఈ క్యాంపెయిన్‌లో ఎన్‌వైఎస్, పిడిఎస్ఓ నాయకులు పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

సమైక్య ఆంధ్రను కోరుతూ విద్యార్థి జెఏసి ఆధ్వర్యంలో 19–11–2013న నగరంలో జరిగిన ‘విద్యార్థుల మండే గుండెల ఘోష’ సభ సందర్భంగా పిడిఎస్ఓ–ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో హిందూ కాలేజి సెంటర్‌లో 13,000 కరపత్రాలు పంపిణీ చేశారు. నగరం పాలెం సి.ఐ కరపత్రాలు పంచడానికి వీలులేదని, పిడిఎస్ఓ నాయకులు కె.వి.రమణ, నాగేంద్రలను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళుతుండగా దానిని ప్రశ్నించిన ఎన్‌వైఎస్ నాయకులు దండా ప్రసాద్‌ను కూడా స్టేషన్‌కు తీసుకెళ్ళారు. ఈ ఘటనలో కె.వి.రమణను సి.ఐ తన ఇష్టానుసారంగా కొట్టడాన్ని సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు.

### రేపల్లె ఏరియా

భట్టిప్రోలు మండలంలోని స్కూళ్ళలోనూ, ఐలవరం స్కూల్‌లోని విద్యార్థుల మధ్య; గ్రామంలోని ప్రజల మధ్య; వెల్లటూరు పట్టణంలోనూ, స్కూళ్ళలోనూ; రేపల్లె స్కూల్స్, కాలేజీలలోనూ; రేపల్లె చుట్టుప్రక్కల గ్రామాలలోను క్యాంపెయిన్ సాగించారు. కొన్ని సందర్భాలలో ప్రజల నుండి వచ్చిన సందేహాలకు – కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, మరికొన్ని ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా వుండటానికి, ప్రజల శ్రమను కారుచౌకగా దోచుకోవడానికి దోపిడీ పాలకులు అనుసరిస్తున్న విధానాలే కారణమని వివరించారు.

### మంగళగిరి ఏరియా

మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లోని చినకాకాని, పెద్దవడ్లపూడి, నూతక్కి, వడ్డేశ్వరం, పెనుమాక, కృష్ణనగర్, ప్రకాష్‌నగర్‌లలోనూ, మంగళగిరి పట్టణంలోనూ ప్రజలమధ్య, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల మధ్య ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది రెచ్చగొడుతున్నా ప్రాంతీయ వైషమ్యాలకు బలికాకుండా సమస్యల పరిష్కారంకోసం ఉద్యమించడమే ఏకైక మార్గమని ఈ ప్రచార కార్యక్రమంలో వివరించుకుంటూ, నినాదాలు చేస్తూ ఇంటింటికీ కరపత్రాన్ని అందచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికై, అందరికీ విద్యా, వైద్యం, కూడు, గూడు, గుడ్డ హక్కులకై ఉద్యమిద్దామని పిలుపునిస్తూ క్యాంపెయిన్ నిర్వహించారు.

### ఆచార్య నాగార్జున యూనివర్శిటీ

ఏఎన్‌యు లోని అన్ని శాఖలలో ప్రతి విద్యార్థికీ కరపత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో విద్యార్థుల నుండి, ప్రొఫెసర్స్ నుండి సానుకూల స్పందన వచ్చింది. ప్రజల సమస్యలను పట్టించుకున్న పాలకులులేరని, రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం ఉద్యమం నడుస్తున్నదని, నాటకం ఇంకా ముగియలేదని, ఎక్కువమంది ప్రొఫెసర్స్ పిడిఎస్ఓని సమర్ధిస్తూ ఏ సంఘం చేయని కృషిని ధైర్యంగా చేస్తున్నారని అభినందించారు.

### పల్నాడు ప్రాంతం

పిడుగురాళ్ళ, రెంటచింతల, గురజాల మండలాల లోని పలుగ్రామాలలో, పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రజలకు, కార్మికులకు, రైతుకూలీలకు ఇంటింటికీ కరపత్రాని అందచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికై ఉద్యమించాలనే పిలుపునందచేశారు. పిడుగురాళ్ళ పట్టణంలోని లెనిన్‌నగర్, విశ్వమోహన్‌రెడ్డినగర్, తరిమెల నాగిరెడ్డినగర్, కాలనీలలో; పిడుగురాళ్ళలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, పాఠశాలలోను విద్యార్థుల మధ్య విస్తృత ప్రచారం చేశారు. రెంటచింతలలో, కారంపూడిలో రైతులు, కూలీలు, కార్మికులు ప్రజానీకం నడుమ విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రాంతీయ వైషమ్యాల నుండి, ఉద్రేకాల నుండి బయటపడదామన్న నినాదాన్ని మేధావి వర్గానికి, కార్మిక వర్గానికి అందించారు.

*మొత్తంగా ప్రజల యొక్క మౌలికసమస్యల పరిష్కారమే ప్రధాన అంశంగా చేసుకొని సాగిన ఈ ప్రచారకృషి అత్యధిక ప్రజలను, కార్మికులను, వ్యాపారస్తులను, మేధావివర్గాన్ని, ప్రజాతంత్ర వాదులను, విద్యార్థి, యువకులను ఆలోచింప చేసింది. అధికసంఖ్యలో ప్రజానీకం, విద్యార్థి యువకులు ఈ వైఖరికి సానుకూలంగా స్పందించారు.* ✡

## ‘ప్రజా సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమిద్దాం!’ మంగళగిరి ప్రాంతంలో స్థానిక సమస్యలపై క్యాంపెయిన్

**పిడిఎస్ఓ–ఎన్‌వైఎస్** గుంటూరు జిల్లా కమిటి ‘మంగళగిరి ఏరియా ప్రజల సమస్యల పరిష్కారానికై సంఘటితంగా ఉద్యమిద్దాం!’ అని పిలుపునిస్తూ ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరపత్రం ప్రచురించింది. మంగళగిరి ప్రాంతంలో ప్రభుత్వ విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టల్స్, కళాశాలలలో వసతి సౌకర్యాలను మెరుగుపర్చాలనే డిమాండ్‌తోపాటుగా ప్రజలు, కార్మికులు, రైతాంగం ఎదుర్కొంటున్న ఈ క్రింది డిమాండ్స్‌ను జోడించారు.

★ గుంటూరు–విజయవాడ నగరాలతోపాటు 4–5 జిల్లాల ప్రజల వైద్య అవసరాలు తీర్చే, దశాబ్దాల కాలంగా ప్రజల డిమాండ్ అయిన మంగళగిరిలో సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ నుండి ప్రజల్ని విముక్తం చేసేందుకు దోహదం చేసే ఆసుపత్రి నిర్మాణం కోసం ఆందోళన చేపడదాం.

★ ప్రజలందరికీ పరిశుభ్రమైన త్రాగునీరు అందించాల్సిన పాలకులు నీటి వ్యాపారానికి, కోకాకోలా కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వడంలో ఉత్సాహం చూపుతున్నారు. మంగళగిరి మండలం, పెదవడ్లపూడి గ్రామానికి సమీపంలో ఏర్పరచిన కోకాకోలా ప్లాంట్ వలన భూగర్భ జలాలు తగ్గిపోవడంతోపాటు, నీరు కలుషితమైంది. గ్రామస్తులంతా మినరల్ వాటర్ ప్లాంట్ సరఫరా చేసే నీటిని కొనుక్కొని త్రాగవలసి వస్తున్నది. వడ్లపూడి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోరు నుండి కలుషితనీరు రావడంతో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు, గ్రామానికి పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చెయ్యాలని, భూగర్భ జలాలను నాశనం చేస్తున్న కోకాకోలా ప్లాంట్‌పై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దాం.

★ తాడేపల్లి మండలంలోని కృష్ణా సిమెంట్ వర్క్స్ కంపెనీ 1993లో అక్రమ లాకౌట్‌కు గురైంది. ఆనాటి నుండి గత 20 సంవత్సరాలుగా వందలాది మంది కార్మికులు పనిని కోల్పోయారు. వేతన బకాయిలు, పరిహారాలను నేటికీ పొందలేదు. పైగా తమ న్యాయమైన హక్కుల సాధనకు కోర్టుల చుట్టూ తిరుగుతూ వేల రూపాయలు ఫీజుల క్రింద సమర్పించుకొంటున్నారు. ఈ క్రమంలో ఎందరో కార్మికులు చనిపోయారు. కార్మికుల వేతన బకాయిలను, పరిహారాలను తక్షణం చెల్లించాలని, కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిద్దాం.

★ కొండవీటి వాగు ముంపు మంగళగిరి, తుళ్ళూరు, తాడేపల్లి మండలాలకు చెందిన గ్రామాల రైతులెదుర్కొంటున్న అతిపెద్ద దీర్ఘకాలిక సమస్యగా ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా, దశాబ్దాలుగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం ప్రభుత్వం చూపడంలేదు. ప్రతి సంవత్సరం వందల ఎకరాల్లో పంట ముంపుకు గురై, ప్రధానంగా కౌలురైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు పరిహారాలు కూడా అందక ఆత్మహత్యల బాటపడుతున్నారు. (పెదపరిమి, జూపూడి రైతుల ఆత్మహత్యలు) కొండవీటివాగు ముంపుకు శాశ్వత పరిష్కారచర్యలకై ఉద్యమిద్దాం.

★ జాతీయ రహదారి 6 లైన్ల విస్తరణ కారణంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామస్థులు, పశువులు, అటుఇటూ దాటడానికి తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయి. రవాణావ్యవస్థ వ్యధాభరితమైంది. యాక్సిడెంట్‌లు పెరిగాయి. వర్షపునీరు, మురుగు నీరు పారుదల వ్యవస్థ చిన్నాభిన్నమై ఎక్కడి మురుగు అక్కడ నిలిచిపోతున్నది. ఈ సమస్యకు తగు పరిష్కారాన్ని తక్షణం చేపట్టాలని డిమాండ్ చేద్దాం.

★ చినకాకాని నుండి బేతపూడి మీదుగా కరకట్ట వరకు వేయ తలపెట్టిన మినీ బైపాస్ ప్రతిపాదనలను విరమించుకోవాలని ఉద్యమిద్దాం.

★ మంగళగిరి నుండి ప్రకాశం బ్యారేజీ మధ్యలో గత 30 సం॥ల్లో ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయి. (ఉదా:ప్యారీ, డాల్డా వగైరా) ప్రజలకు ఉపాధి నందించే చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి, ఏర్పాటువైపుగా ప్రభుత్వం దృష్టిసారించడం లేదు. సెజ్‌ల పేరుతో బహుళజాతి కంపెనీలకు వేల ఎకరాలు కట్టబెట్టడానికి మాత్రం సిద్ధమౌతున్నది (ఉదా : నాలెడ్జ్ పార్కు, రిక్రియేషన్ క్లబ్ వగైరా) ఈ ప్రాంత యువతరానికి ఉపాధినందించే వైపుగా పరిశ్రమలు అభివృద్ధి చేయాలని ఉద్యమిద్దాం.

పై సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిస్తూ తాడేపల్లి మండలంలోని నిడమర్రు, నూతక్కి, పెద్దవడ్లపూడి, చినకాకాని, బాబూజీనగర్, కురగల్లు, బేతపూడి, మంగళగిరి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప, మార్కండేయ కాలనీ, కొప్పరావూరు కాలనీ, కొత్తపేట, రత్నాల చెరువు, లక్ష్మీనరసింహస్వామి కాలనీ, సూర్యనారాయణ కాలనీ, ఎమ్ఎస్ఎస్ నగర్‌లలో ప్రచార క్యాంపైన్ చేపట్టారు.

మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద సమైక్యాంధ్రను కోరుతూ కార్మికులు ఏర్పాటుచేసిన దీక్షాశిబిరం వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలకు, విద్యార్థి యువకులకు, కార్మికులకు, వ్యాపారస్తులకు వీధివీధినా క్యాంపైన్ చేస్తూ ఇంటి ఇంటికి వెళ్ళి స్థానిక సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని వివరించే కరపత్రాలు అందచేశారు. అనంతరం సమస్యలతో కూడిన డిమాండ్స్ తయారుచేసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ ప్రచారం సందర్భంలో అనేక మంది ఉపాధ్యాయులు, కార్మికులు, వ్యాపారస్థులు మీరు చెబుతున్నది, మీ వైఖరి సరిగా వుందనీ; కరపత్రంలో పేర్కొన్న సమస్యలు ఖచ్చితంగా పరిష్కరించుకునేందుకు ప్రజలంతా ఉద్యమించాలని అభిప్రాయాలు వ్యక్తంచేశారు. ✡

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010